

నేటి అలంకారం
మహా చండీదేవి



కనకదుర్గానగర్‌లో ఆదిదంపతుల నగరోత్సవం (ఇన్‌సెట్‌లో) లలితా త్రిపురసుందరీ దేవిగా దుర్గమ్మ ఉత్సవమూర్తి



క్యూల్లో బారులు తీరిన భక్తులు





ఓవైపు జైభవానీ అంటూ భక్తుల జేజేలు.. మరోవైపు పండితుల మంత్రోచ్చారణలు.. అటువైపు కుంకుమార్చనల ధగధగలు.. ఇటువైపు విద్యుల్లతా హారాల విగనిగలు.. అటుచూస్తే వలంటీర్ల సేవాస్ఫూర్తి.. ఇటుచూస్తే సాంస్కృతిక కార్యక్రమాల దీప్తి, ముత్తయిదు వాయినాలు, సువాసినీ పూజలు, వేదసభలు, నివేదనలు, అన్నప్రసాదాలు, హోమాది క్రతువులు.. ఒక్కటేమిటి.. తెలుగునాట భక్తిభావమంతా ఇంద్రకీలాద్రి వ్యాపిత్మైందా అన్నట్టుగా దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. శనివారం లలితా వదనారవిందాన్ని చూసి తరించేందుకు భక్తులు క్యూ కట్టారు. రాకపోకల్లో హెచ్చుతగ్గులు కనిపించినప్పటికీ దర్శనం మాత్రం సాఫీగానే సాగిపోయింది.



కుంకుమార్చనలో పాల్గొన్న ఉభయదాతలు



నగరోత్సవంలో కేరళ డ్రమ్స్

శ్రీలలిత శివజ్యోతి

లలితాత్రిపుర సుందరీదేవిగా దుర్గమ్మ దర్శనం

ఘనంగా అర్చకసభ

అర్చకుల సాధకబాధకాలపై ప్రత్యేక చర్చ

- దర్శనానికి విచ్చేసిన వీఐపీలు.. సినీ ప్రముఖులు
- ఒక్కరోజే లక్షమంది భక్తుల రాక.. రికార్డు
- నేటి నుంచి మరింత పెరిగే అవకాశం
- తగినట్టుగా అధికార యంత్రాంగ ఏర్పాట్లు



(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ శనివారం శ్రీలలితా త్రిపురసుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన డ్యాష్ బోర్డు గణాంకాల ప్రకారం రాత్రి 7 గంటల వరకు 92,360 మంది దుర్గమ్మను దర్శించుకున్నారు. అన్నప్రసాదాన్ని 20,895 మంది స్వీకరించారు. 2,125 మంది కేశఖండనశాలలో తలనీలాలు సమర్పించారు. 1,74,720 లడ్డూల కొనుగోలు జరిగింది. అమ్మవారిని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, శాప్ చైర్మన్ రవినాయుడు, గాయని సునీత దర్శించుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా దుర్గమ్మ ఆదివారం మహాచండీగా దర్శనమిస్తారు. తెల్లవారుజామున 4 గంటల నుంచి దర్శనానికి అనుమతిస్తారు. భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉండటంతో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

సింగర్ సునీత సందడి

ఎమ్మెల్యే బాలకృష్ణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కేశినేని శివనాథ్, ముత్తవరపు మురళీకృష్ణ, వసంత కృష్ణప్రసాద్



కళలకు పుట్టినిల్లు కృష్ణాజిల్లా

విజయవాడలో ఉత్సవాలు ఎంతో ఆనందదాయకం

గొల్లపూడి ఎగ్జిబిషన్ ప్రారంభ సభలో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ

ఇబ్రహీంపట్నం/గొల్లపూడి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : అనేక కళల పుట్టినిల్లు అయిన భారతదేశం ఒక గొప్ప కళాఖండమని, దేశ నలుమూలలకు భారతఖ్యాతిని ఇనుమడింపజేసిన అనేక మంది కళాకారులకు జన్మస్థలమని ప్రముఖ సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. విజయవాడ ఎక్స్‌పో (గొల్లపూడి ఎగ్జిబిషన్)ను శనివారం ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంతరించిపోతున్న కళలను పునరుద్ధరించడానికి, వాటి ఔన్నత్యాన్ని నేటితరానికి తెలియజేయడానికి విజయవాడ ఉత్సవ్ గొప్ప

మిగతా 8లో..

అయ్యో ఆక్వా

జిల్లాలో తగ్గుతున్న రొయ్యల సాగు

- వైసీపీ హయాంలో విద్యుత్ రాయితీ తొలగింపు
- ఆక్వాజోన్ పరిధిలోని చెరువులకే సబ్సిడీ
- రూ.లక్షల్లో విద్యుత్ బిల్లులు వస్తుండటంతో అవస్థలు
- క్రమంగా సాగుకు దూరమవుతున్న రైతులు
- తాజాగా రొయ్యల ఎగుమతులపై అమెరికా సుంకాలు
- కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు



జిల్లాలో రొయ్యల సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఓవైపు విద్యుత్ చార్జీల మోత, పెరిగిన మేత ఖర్చులు, మరోవైపు అగ్రరాజ్యం అమెరికా రొయ్యల ఎగుమతులపై సుంకాల పెంపు తదితరాలతో ఆక్వారంగం ఉక్కిరిబిక్కిరవుతోంది. రొయ్యల ఎగుమతులపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ రాకపోవడంతో సాగు చేయాలా, వద్దా అనే మీమాంసలో రైతులు ఉన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆక్వాజోన్ పేరుతో విద్యుత్ చార్జీలపై రాయితీ ఎత్తివేయడంతో పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయిన రైతులు కూటమి ప్రభుత్వంలో అయినా సమస్య పరిష్కారం అవుతుందా.. అనే ఆశతో ఎదురుచూస్తున్నారు.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాలో 111 కిలోమీటర్ల మేర సముద్రతీరం ఉంది. ఆ వెంబడి ఉన్న మచిలీపట్నం, కృత్తివెన్ను, బంటుమిల్లి, పెడన, కోడూరు, నాగాయలంక, మోపిదేవి మండలాలతో పాటు నందివాడ, గుడివాడ మండలాల్లోనూ రొయ్యల సాగు జరుగుతోంది. రెండు, మూడేళ్ల కిందటి వరకు 52 వేల ఎకరాల్లో రొయ్యల సాగు జరిగినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఈ ఏడాది 37,500 ఎకరాల్లో మాత్రమే సాగు జరుగుతోందని మత్స్యశాఖ అధికారుల అంచనా. కానీ అనధికారికంగా జిల్లాలో 75 వేల ఎకరాల్లో రొయ్యలసాగు

మిగతా 8లో..

వైసీపీ హయాంలో పతనం

వైసీపీ హయాంలో పట్టాదార్ పాస్ పుస్తకాలు ఉన్న భూములనే ఆక్వా జోన్‌లో చేర్చి విద్యుత్ సబ్సిడీ ఇస్తామనే ఆంక్షలు పెట్టారు. తీరప్రాంతంలోని మండలాల్లో అసైన్డ్ భూములే అధికం. ఈ భూములకు సాగునీటి లభ్యత లేక, వేరే పంటలు సాగుచేసే అవకాశం లేక రొయ్యల చెరువులుగా మార్చి సాగు చేస్తున్నారు. గతంలో అసైన్డ్ భూముల్లో సాగుచేసే రొయ్యల చెరువులకు కూడా విద్యుత్ సబ్సిడీ ఇచ్చేవారు. ఆక్వాజోన్ అంశం తెరపైకి వచ్చాక అసైన్డ్ భూముల్లో సాగుచేసే రొయ్యల చెరువులకు ఆ రాయితీని ఎత్తేశారు. దీంతో రైతులకు కష్టాలు ప్రారంభమయ్యాయి. పట్టాదార్ పాస్ పుస్తకాలు ఉన్న భూములనే ఆక్వాజోన్ పరిధిలోకి తెచ్చి, 10 ఎకరాల్లోపు ఉన్న రొయ్యల చెరువులకు 4,344 కనెక్షన్లకే విద్యుత్ రాయితీ ఇస్తున్నారు.

పెరుగుతున్న వరద



ఘాట్లను పరిశీలిస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణమ్మ ఉరకలు

- భక్తుల భద్రత కోసం పటిష్ట ఏర్పాట్లు
- స్నానఘాట్లలో రెండంచెల బారికేడ్లు
- భక్తులు వరదనీటిలో దిగొద్దు : కలెక్టర్ లక్ష్మీశ

8



పున్నమిఘాట్‌లో పాటలు పాడుతున్న సమీర భరద్వాజ్

సరదాగా సంగీతోత్సవ్

విజయవాడ ఉత్సవ్‌లో సుస్వరాల ఝరి

ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో మార్మోగిన సునీత మ్యూజికల్ నైట్

- పున్నమిఘాట్‌లో సమీరా భరద్వాజ్ పాటల హోరు
- ఘంటసాల కాలేజీలో సాంస్కృతిక సందడి

విజయవాడ సిటీ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మధురమైన పాటలతో 'విజయవాడ ఉత్సవ్' సుస్వరాల ఝరిగా మారింది. గొల్లపూడి ఎగ్జిబిషన్ ప్రాంగణంతో పాటు పున్నమిఘాట్, ఘంటసాల సంగీత కళాశాల పలు సంగీత, నృత్య కార్యక్రమాలకు వేదికలుగా మారాయి. ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో సింగర్ సునీత బిగ్ మ్యూజిక్ లైవ్ షో జరిగింది. సునీత పాడిన పాటలు యువతను హుషారెత్తించాయి. పున్నమి ఘాట్‌లో సమీరా భరద్వాజ్ మ్యూజిక్ షో, గరగ ఉత్సవ్, దాండియా ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముక్కామల గ్రామానికి చెందిన 12 మంది బృందం వేదికపై చేసిన గరగలు ఆశ్చర్యపరిచాయి. మధ్యలో ఇంద్రజాల విద్యను కూడా ప్రదర్శించారు. దుర్గాపురంలోని ఘంటసాల సంగీత, నృత్య కళాశాలలో సైతం సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను కనువిందు చేశాయి.



గొల్లపూడి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో బేతాళ కళాకారులు



న్యాయమూర్తి గోపాలకృష్ణారావుకు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందిస్తున్న ఆలయ పర్యవేక్షకులు

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సేవలో హైకోర్టు న్యాయమూర్తి గోపాలకృష్ణారావు

మోపిదేవి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని హైకోర్టు న్యాయమూర్తి వి.గోపాలకృష్ణారావు కుటుంబసమేతంగా శనివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చక బృందం వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. నాగపుట్టలో పాలుపోసి స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. అర్చక బృందం వేద మంత్రాలతో ఆశీర్వచనం పలికి శేషవస్త్రాలతో వారిని సత్కరించారు. ఆలయ పర్యవేక్షకులు బొప్పన సత్యనారాయణ స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు న్యాయమూర్తి దంపతులకు అందజేశారు. తహసీల్దార్ ఎం.హరనాథ్ వెంటఉన్నారు.

అభయాంజనేయ స్వామి సేవలో హైకోర్టు జడ్జి మల్లిఖార్జునరావు

హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు న్యాయమూర్తి తల్లాప్రగడ మల్లిఖార్జునరావు దంపతులు శనివారం జంక్షన్ అభయాంజనేయ స్వామిని దర్శనం చేసుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు మారపల్లి సీతారామానుజాచార్యులు అర్చనలు జరిపారు. న్యాయమూర్తి దంపతులను స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. జంక్షన్ ఎస్సై వి.సురేష్, సిబ్బంది న్యాయమూర్తికి సాదర స్వాగతం పలికారు.



స్వామిని దర్శించుకుంటున్న జడ్జి మల్లిఖార్జునరావు దంపతులు

మాదకద్రవ్యాల విక్రేత అరెస్టు

పాయకాపురం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ నగర శివార్లలో మాదకద్రవ్యాలు అమ్ముతున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గుణదలకు చెందిన తుప్పలపూడి దుర్గారావు(27) టైల్స్ పని చేస్తుంటాడు. బెంగుళూరు నుంచి డ్రగ్స్ (ఎండీఎంఏ) తెచ్చి నగర శివారు ప్రాంతాల్లో విక్రయాలు జరుపుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. సీఐ కృష్ణమోహన్ తన సిబ్బందితో అతనిపై నిఘా పెట్టారు. పాయకాపురం శివారులో శనివారం ఎండీఎంఏను విక్రయించేందుకు వచ్చిన దుర్గారావును అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద సుమారు రూ.లక్ష విలువ చేసే 13 గ్రాములు ఎండీఎంఏ డ్రగ్ గుర్తించి కేసు నమోదు చేశారు. డ్రగ్‌ను బెంగుళూరు నుంచి తెచ్చి నగర శివారుల్లో విక్రయిస్తున్నట్లు గతంలో కూడా విక్రయించినట్లు పోలీసుల విచారణలో తేలింది. మరో నిందితుడి కోసం గాలిస్తున్నారు.



మీన్స్ కమ్ మెరిట్ మెటీరియల్, కౌశల్-25 పోటీల వాల్‌పోస్టర్లు ఆవిష్కరించిన కలెక్టర్ బాలాజీ, డీఈవో రామారావు

నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ పరీక్షకు విద్యార్థులు హాజరు కావాలి : కలెక్టర్

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షకు విద్యార్థుల హాజరు కావాలని కలెక్టర్ డీకే బాలాజీ పిలుపునిచ్చారు. జాతీయ అవార్డు గ్రహీత ఎం.శ్రీనివాసరావు రూపొందించిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష మెటీరియల్‌ను ఆయన ఆవిష్కరించారు. భారతీయ విద్యా మండలి, ఏపీ సైన్స్ సిటీ ఆధ్వర్యంలో నిర్వహించే కౌశల్-2025 పోటీల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. డీఈవో పి.వి.జె.రామారావు మాట్లాడుతూ, జిల్లా స్థాయిలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు కౌశల్- 2025 క్విజ్, పోస్టర్ల పోటీలు నవంబరు 27న 8, 9 తరగతుల విద్యార్థులకు, 28న 10వ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్నామన్నారు. తాళ్లపాలెం టీచర్ ఝాన్సీలక్ష్మీబాయి, జిల్లా సైన్స్ ఆఫీసర్ జకీర్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.



ఒడిశా, యూపీకి చెందిన పాత నేరస్థులను విచారిస్తున్న ఏడీసీపీ ఎం.రాజారావు

దుర్గగుడి పరిసరాల్లో ప్రత్యేక నిఘా

- పోలీసుల అదుపులో పాత నేరస్తులు

సత్యనారాయణపురం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడి పరిసరప్రాంతాల్లో నేరాలు నిరోధించేందుకు పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. కనకదుర్గానగర్‌లో అడిషనల్ డీసీపీ (క్రైమ్) ఎం.రాజారావు నేతృత్వంలో పోలీసులు మఫ్టీలో ఉండి అనుమానాస్పదంగా ఉన్న వారిని మొబైల్ సెక్యూరిటీ చెక్ డివైస్ (ఎమ్ఎస్‌సీడీ) ద్వారా ఫింగర్ ప్రింట్ తీసుకొని చెక్ చేస్తున్నారు. ఇప్పటికే అనేక మంది అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. వినాయకుడి గుడి వద్ద శనివారం పాత నేరస్తులు ఒడిశాకు చెందిన రాజీవ్ మహారణ, యూపీకి బలరాం ప్రజాపతి, తిరుమలలో టూటౌన్‌లో రెండు కేసులు తిరుపతికి చెందిన మురళీకృష్ణను, నేరాలకు పాల్పడే యువతిని అదుపులోకి తీసుకున్నారు. వీరందరినీ కనకదుర్గానగర్ పోలీసు పోస్టు వద్ద విచారణ చేస్తున్నారు.

ముంగిస దెబ్బకు తాచు పరార్ !

గుడ్లవల్లేరు : పాము-ముంగిస పోరాటాన్ని మామిడికోళ్ల గ్రామస్తులు శనివారం ప్రత్యక్షంగా చూశారు. పుల్లేరు కాల్వగట్టుపై నుంచి ఉండే మామిడికోళ్ల ఆర్ అండ్ బి రహదారిపై రోడ్డు పక్కన పొదల నుంచి పాము రోడ్డుపైకి అకస్మాత్తుగా వచ్చింది. దానిని వెంబడిస్తూ ముంగిస కూడా వచ్చింది. దాదాపు 25 నిమషాల పాటు ఆ రెండూ పోరాడాయి. పాము ప్రాణ భయంతో పొదల్లోకి వెళ్లి అక్కడ నుంచి బుసలు కొట్టింది. కొంత సేపటికి ముంగిస వెళ్లిపోయిన తరువాత పాము కిందకు దిగింది. అదే ప్రాంతంలో రెండు తాచులు నాట్యం చేయడం చూశామని గ్రామస్తులు చెబుతున్నారు.



కనులారా వీక్షించి..

- శ్రీలలితా త్రిపుర సుందరీ దేవికి భక్త నీరాజనం
- అమ్మవారి సేవలో ప్రముఖులు

ఇంద్రకీలాద్రి శనివారం భక్త సంద్రమైంది. శ్రీలలితా త్రిపురసుందరీ దేవిగా కొలువుదీరిన కనకదుర్గమ్మను దర్శించుకోవడానికి భక్తులు బారులు తీరారు. రద్దీ ఎక్కువగా ఉన్నప్పటికీ ఎక్కడా క్యూలో భక్తులు వేచి ఉండకుండా ముందుకు కదలడంతో ఎటువంటి ఇబ్బందులు లేకుండా అమ్మవారిని కనులారా వీక్షించి తరించారు. వీఐపీల కట్టడితో సామాన్య భక్తులు ప్రశాంతంగా దర్శనం చేసుకున్నారు.
(విజయవాడ-ఆంధ్రజ్యోతి)

కనకమహాలక్ష్మీ ఆలయం నుంచి కనకదుర్గమ్మకు పట్టు వస్త్రాలు



కనకదుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పిస్తున్న కనకమహాలక్ష్మీ దేవాలయం ఈవో శోభారాణి, ద్వారకా తిరుమల వేంకటేశ్వరస్వామి దేవాలయం ఈవో ఎన్‌వీఎస్ఎన్ మూర్తి,

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : దసరా మహోత్సవాలను పురస్కరించుకుని కనకదుర్గమ్మకు విశాఖపట్నంలో కొలువైన కనకమహాలక్ష్మి దేవస్థానం నుంచి పట్టువస్త్రాలు సమర్పించారు. కనకమహాలక్ష్మి దేవాలయం ఈవో కె.శోభారాణి ఆలయ అధికారులు, అర్చకులతో కలిసి పట్టు వస్త్రాలు, సారె సమర్పించారు. ఈవో శోభారాణి మాట్లాడుతూ, ఉత్సవాల సమయంలో అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించే సత్సంప్రదాయం కొనసాగాలన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పెద్ద ఎత్తున అధికార యంత్రాంగం చర్యలు చేపట్టినందుకు అభినందనలు చెబుతున్నానన్నారు

ద్వారకా తిరుమల నుంచి..

ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి దేవస్థానం నుంచి ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మకు శనివారం పట్టు వస్త్రాలు, సారె సమర్పించారు. ఈవో ఎన్‌వీఎస్ఎన్ మూర్తి, ప్రధానాచార్యులు పీఏ సింగరాచార్యులు, వేదపండితుడు వెంకటేశ్వరశర్మ తదితరులతో కలసి పట్టువస్త్రాలు, సారె సమర్పించారు. ఈవో మూర్తి మాట్లాడుతూ, ద్వారకా తిరుమలలో అక్టోబరు 2 నుంచి పదో తేదీ వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలు జరుగుతాయన్నారు. ఆరో తేదీన స్వామివారి కల్యాణం, ఏడో తేదీన రథోత్సవం జరుగుతాయని తెలిపారు.

అమ్మవారి సేవలో ప్రముఖులు

విజయవాడ (ఇంద్రకీలాద్రి) : ఇంద్రకీలాద్రిపై దసరా మహోత్సవాలలో ఆరో రోజైన శనివారం కనకదుర్గమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. లలితా త్రిపుర సుందరి దేవి అలంకారంలో ఉన్న కనకదుర్గమ్మను ప్రముఖ సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ శనివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికా రు. మీడియా పాయింట్ వద్ద బాలకృష్ణ మాట్లాడుతూ, జగజ్జనని దుర్గమ్మను దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. దుర్గమ్మ ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరుకున్నానన్నారు. గాయని సునీత అమ్మవారిని దర్శించుకుని వేద ఆశీర్వచనం పొందారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యే లు బత్తుల రామకృష్ణ, కూనరవికుమార్, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్, బ్రాహ్మణ కార్పొరేషన్‌చైర్మన్ బుచ్చి రాం ప్రసాద్, శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మవారు స్త్రీ శక్తికి ప్రతీక అని ఎన్‌టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షుడు, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురామ్ అన్నారు. కుటుంబ సభ్యులతో కలిసి బాలాత్రిపుర సుందరి రూపంలో ఉన్న కనకదుర్గమ్మవారిని శనివారం ఆయన దర్శించుకున్నారు. స్త్రీ శక్తి పథకం అమలు చేయడం వల్ల మహిళలు ఆనందంగా అమ్మవారిని దర్శించుకుంటున్నారన్నారు. ప్రజలందరినీ ఆదరించమని, కనికరించమని వేడుకున్నట్లు తెలిపారు.



అమ్మవారి సేవలో హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ, గాయని సునీత, మాట్లాడుతున్న నెట్టెం రఘురాం

జల్లుస్నానాల వద్ద అంతరాయం

పాత రాజరాజేశ్వరిపేట : దసరా ఉత్సవాల్లో శనివారం జల్లు స్నానాల వద్ద అంతరాయ ఏర్పడింది. శనైశ్వర స్వామి గుడి ఘాట్ వద్ద ఉదయం 7.40 గంటల నుంచి 8.50 వరకు పైపుల నుంచి నీళ్లు రాకపోవడంతో స్నానాలకు భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అధికారులు మరమ్మతులు నిర్వహించడంతో భక్తులు తిరిగి జల్లు స్నానాలు చేశారు.

ఐదో రోజు ఆదాయం రూ.37.17 లక్షలు

ఇంద్రకీలాద్రి : దసరా మహోత్సవాలలో ఐదో రోజైన శుక్రవారం దుర్గమ్మ దేవస్థానానికి రూ. 37,17,378 ఆదాయం వచ్చినట్లు ఈవో శీనానాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. లడ్డు ప్రసాద ఒక్కోటి విక్రయం ద్వారా రూ.4,58,676, ఒక్కో ప్యాక్ రూ.100ల లడ్డు ప్రసాదం విక్రయం ద్వారా రూ. 30,42,700 వచ్చినట్లు తెలిపారు. పరోక్ష ప్రత్యేక కుంకుమార్చన సేవ ద్వారా రూ.33 వేలు (టికెట్ రూ.3000), పరోక్ష ప్రత్యేక కుంకుమార్చన ద్వారా రూ 5,000 ద్వారా (టికెట్ రూ.5000), చండీ హోమంద్వారా రూ.12 వేలు, ప్రత్యేక ఖడ్గమాలార్చన ద్వారా రూ.35,812, పుస్తకాలు, ఫొటోలు, కాలెండర్ల ద్వారా రూ.13,350, తలనీలాల సమర్పణ రుసుం ద్వారా రూ.1,12,840, ఇతరత్రా ఆదాయం రూ.4,000 చొప్పున ఆదాయం వచ్చిందన్నారు.

వినాయకుడి గుడి వద్ద చెప్పుల స్టాండ్



పాయకాపురం : దసరా ఉత్సవాల్లో భాగంగా నగర పాలక సంస్థ అధికారులు వినాయకుడి గుడి వద్ద చెప్పుల స్టాండ్ ఏర్పాటు చేశారు. గుడి వద్ద నుంచే క్యూలైన్లు ప్రారంభం కావడంతో దర్శనానికి వచ్చే భక్తులు అక్కడే రోడ్లపై చెప్పులను వదిలి వెళ్తుండటంతో రోడ్లపై అన్నీ చెప్పులే కనిపిస్తున్నాయి. దీంతో అధికారులు గుడి వద్ద ఏ టు ఎఫ్ ఏడు బ్లాక్‌లుగా చెప్పుల స్టాండ్‌ను ఏర్పాటు చేశారు.

దర్జాగా రోడ్లపై వాహనాల పార్కింగ్

ఎవరు ఏమన్నా మేము ఇక్కడే వాహనాలను పార్క్ చేస్తామంటున్నారు వాహనదారులు. ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాల సందర్భంగా పోలీసు అధికారులు రో డ్లపై ఎక్కడా వాహనాలను పార్క్ చేయనివ్వడం లేదు. శనివారం మోడల్ గెస్ట్ హౌస్ వద్ద మాత్రం కొంత మంది దర్జాగా వాహనాలను రోడ్లపై పార్క్ చేశారు

అర్చకుల సంక్షేమానికి కృషి

- వేద మహాసభలో ఈవో శీనా నాయక్

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): అర్చకుల సంక్షేమానికి కృషి చేస్తానని దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ఈవో శీనానాయక్ చెప్పారు. దసరా మహోత్సవాలలో సంప్రదాయంగా జరిగే అర్చక సభ, అర్చక సత్కార కార్యక్రమాలను శనివారం ఆలయంలో నిర్వహించారు. ఈవో శీనా నాయక్ మాట్లాడుతూ ఎటువంటి ప్రముఖ వ్యక్తి అయినా సరే ఆలయాలకు వస్తే తొలుత సంప్రదించేది అర్చకుడినేనని తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాలలోనూ అర్చకులు సాధక బాధలను తెలుసుకోడానికి, వ్యవస్థను మరింత మెరుగ్గా తీసుకురావడానికి ఇటు వంటి సభలు దోహదం చేస్తాయన్నారు. కాలానుగుణ వస్తుల మార్పులు కారణంగా అర్చకత్వం తీసుకోవడానికి చాలా మంది సుముఖత చూపడం లేదన్నారు. విదేశీ సంస్కృతితో మన సంస్కృతి దెబ్బతినకుండా చూడాల్సిన బాధ్యత అర్చకులదేనని తెలిపారు. దసరాలలో అమ్మవారికి అలంకారాలను నిర్వహిస్తున్న కోట రవికుమార్‌ను సభికులు ప్రశంసించారు. రవి కుమార్ మాట్లాడుతూ. 2009 నుంచి అర్చక సభను నిర్వహిస్తున్నామని, ఇందుకు ఆనాటి పెద్దలు సహకరించారని వారిని గుర్తు చేసుకున్నారు. భద్రాచలం స్థానాచార్యుడు కె.ఈ ఎస్.సాయి మాట్లాడుతూ, అర్చకులకు ఆరోగ్య కార్డులు ఇవ్వాలని కోరారు. యాదగిరి గుట్ట ప్రధాన అర్చకుడు దోర్బల శ్రీధర శర్మ మాట్లాడుతూ, అమ్మవారి కృప వల్ల అర్చక సభ ఇక్కడ విజయవంతంగా జరుగుతోందన్నారు. తెలంగాణాలో కూడా ఇటు వంటి సభ జరగాలని ఆకాంక్షించారు. శ్రీశైల దేవస్థాన ముఖ్య అర్చకులు మాట్లాడుతూ అక్కడ వేద సభ జరుగుతోందని, ఇకపై కూడా జరగాలని ఆకాంక్షించారు. దుర్గగుడి స్థానాచార్యుడు శివప్రసాదశర్మ, దుర్గగుడి బోర్డు చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ప్రధాన అర్చకుడు ఎల్ దుర్గా ప్రసాద్, ఉపప్రధాన అర్చకులు కోట ప్రసాద్, వై.నాగరాజు శాస్త్రి, ఎంవీ శాస్త్రివి శ్రీధర్‌తదితరులు కార్యక్రమ నిర్వహణ లో సహకరించారు



అర్చకులను సత్కరించి మాట్లాడుతున్న దుర్గగుడి ఈవో శీనానాయక్

పోలీసుల అత్యుత్సాహం

దసరా ఉత్సవాలకు ఇతర ప్రాంతాల నుంచి విధులకు హాజరైన కొందరు పోలీస్ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. ఉద్యోగుల వద్ద ఐడీ కార్డులు(పాసులు) ఉన్నప్పటికీ డ్యూటీలకు వెళ్లనీయకుండా అడ్డుకుని ఇబ్బందులకు గురిచేస్తున్నారు. శనివారంఆలయ ఏఈవోలు, డీఈలు, వీఐపీలకు ఇచ్చే లడ్లు తీసుకుని సిబ్బంది, ఇతర విభాగాలకు చెందిన సుమారు 20 మంది మహా మండపం దిగువున లిఫ్టులు నుంచి కొండపైకి వెళ్లడానికి ప్రయత్నించారు. అయితే అక్కడ విధుల్లో ఉన్న డీఎస్పీ దినేష్ వారిని పైకి వెళ్లకుండా అడ్డుకున్నారు.

పెరుగుతున్న వరద

- ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణమ్మ ఉరకలు
- భక్తులు వరదనీటిలో దిగొద్దు : కలెక్టర్

(ఆంధ్రజ్యోతి, కలెక్టరేట్) : ప్రకాశం బ్యారేజీకి వరద పెరుగుతోంది. ఎగువ నుంచి వరద ప్రవాహం వస్తున్న నేపథ్యంలో దసరా ఉత్సవాలకు వచ్చే భక్తుల భద్రతకు పగడ్బందీ చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. శనివారం రాత్రి ఆయన దుర్గాఘాట్, భవానీ ఘాట్, సీతమ్మ వారి పాదాలు తదితర ప్రాంతాల్లో పర్యటించి అధికారులకు సూచనలు చేశారు. భక్తుల భద్రతకు తీసుకోవాల్సిన అదనపు చర్యలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఘాట్లలో రెండంచెల బారికేడింగ్ ఏర్పాట్లు చేశామని, జల్లుస్నానాలు చేసేందుకు అన్ని వసతులతో ఏర్పాట్లు ఉన్నాయన్నారు. ముందు జాగ్రత్తగా గజ ఈతగాళ్లను కూడా అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. భక్తులు కూడా క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది సూచనలను పాటించాలని, వరదనీటిలో దిగే సాహసం చేయొద్దని సూచించారు.

అయ్యో ఆక్వా

(7వ పేజీ తరువాయి)

జరుగుతోంది. ఏటా జిల్లాలో 2.52 లక్షల టన్నుల రొయ్యల ఉత్పత్తి జరుగుతోందని అధికారులు అంచనా వేస్తున్నారు.

మూడేళ్లు అభ్యర్థించినా..

వైసీపీ హయాంలో రొయ్యలు సాగుచేసే అధికశాతం భూములను ఆక్వాజోన్ నుంచి మినహాయించారు. దీంతో రైతులు అధికారులకు తాము పడుతున్న ఇబ్బందులను వివరించారు. రెండేళ్ల క్రితం సముద్రతీరం వెంబడి మండలాల్లోని ఆక్వాజోన్ పరిధిలోకి కొంతభూమిని చేర్చామని అధికారులు ప్రకటించారు. అయినా అసైన్డ్ భూముల్లో సాగులో ఉన్న రొయ్యల చెరువులను ఆక్వాజోన్ పరిధిలోకి పూర్తిస్థాయిలో తేలేదు. మత్స్య, విద్యుత్, రెవెన్యూ శాఖల అధికారుల మధ్య సమన్వయం కొరవడి ఈ ప్రక్రియ ముందుకు సాగలేదు. రొయ్యల చెరువులకు సంబంధించి యూనిట్‌కు విద్యుత్ బిల్లుగా రూ.3.84 చొప్పున, అదనపు చార్జీల పేరుతో మరో 5 పైసలను చేర్చి యూనిట్‌కు రూ.3.89 చొప్పున వసూలు చేసేవారు. 100 హెచ్‌పీ ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా 10 ఎకరాల్లోపు విద్యుత్‌ను వాడుకుంటే ఒక్కో యూనిట్‌కు రూ.2.35 రాయితీగా వచ్చేది. రాయితీపోనూ రైతులు నెలకు రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు విద్యుత్ బిల్లులను చెల్లించేవారు. ఆక్వాజోన్‌లో భూమి నమోదు కాలేదనే కారణంతో రాయితీని ఎత్తివేయడంతో 100 హెచ్‌పీ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్ వాడుకున్నందుకు నెలకు రూ.1.50 లక్షల వరకు విద్యుత్ బిల్లులు చెల్లించాల్సి వస్తోంది. రాయితీ లేకపోవడంతో అన్ని ఖర్చులు కలుపుకొని యూనిట్‌కు రూ.6 వరకు విద్యుత్ బిల్లుగా చెల్లించాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తగ్గిన సాగు

మచిలీపట్నం మండలం పెదపట్నం, కానూరు గ్రామాలు సముద్రం పక్కనే ఉంటాయి. స్వచ్ఛమైన సముద్రపు నీరు డ్రెయినే జీల ద్వారా రొయ్యల చెరువులకు అందుబాటులో ఉండటంతో ఈ ప్రాంతంలో సాగుచేస్తే రైతులకు లాభాలు వచ్చేవి. దీంతో ఎకరం రొయ్యల చెరువుకు ఏడాదికి రూ.70 వేల నుంచి రూ.లక్ష వరకు లీజు రూపంలో భూమి యజమానులకు వచ్చేది. భీమవరం కానీ, అనుభవం ఉన్న మనజిల్లాకు చెందిన రైతులు కానీ ఈ ప్రాంతంలో పోటీపడి మరీ లీజులకు తీసుకునేవారు. 2019కు ముందు టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ ప్రాంతంలోని రొయ్యల చెరువులకు విద్యుత్ చార్జీలను యూనిట్‌కు రూ.1.50నే వసూలు చేసేవారు. దీంతో అధిక విస్తీర్ణంలో సాగు జరిగేది. ఈ రెండు గ్రామాల్లోని అధికశాతం భూములను ఆక్వాజోన్ పరిధి నుంచి తొలగించాక నెలకు రూ.లక్షల్లో విద్యుత్ బిల్లులు వస్తుండటడంతో లీజుకు తీసుకున్న రైతులు వెళ్లిపోయారు. మచిలీపట్నం మండలం పెదయాదర, బోగిరెడ్డిపల్లి, కొత్త పల్లెతుమ్మలపాలెం, మోపిదేవి మండలంలోని పెదకళ్లేపల్లి, కోడూరు మండలంలోని హంసలదీవి, ఉల్లిపాలెం, రామకృష్ణాపురం, పిట్టల్లంక తదితర గ్రామాల్లో కృష్ణానదికి, కరకట్టకు మధ్య ఉన్న లంక భూముల్లో రొయ్యల సాగు జరుగుతోంది. లంక భూములను కూడా ఆక్వాజోన్ నుంచి తొలగించడంతో.. విద్యుత్ చార్జీలు అధికమై రైతులు సాగు తగ్గించారు. కూటమి ప్రభుత్వం విద్యుత్ రాయితీ ఇస్తే ఈ ఏడాది నవంబరు నుంచి మళ్లీ రొయ్యల సాగు ఊపందుకుంటుందని రైతులు అంటున్నారు.

కళలకు పుట్టినిల్లు కృష్ణా జిల్లా

(7వ పేజీ తరువాయి)

వేదికైందన్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లా కళలకు పుట్టినిల్లు అన్నారు. సినిమాలకు కేంద్రమైన విజయవాడలో ఇలాంటి కార్యక్రమాలు జరుపుకోవడం ఆనందదాయకమన్నారు. అమ్మవారి ఆశీస్సులతో చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం త్వరితగతిన అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో అనేక ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని, వాటిని అధిగమించేందుకు సీఎం చంద్రబాబు రోజుకు 24 గంటల పనిచేస్తున్నారని చెప్పారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన కేన్సర్ చికిత్సను తక్కువ ధరకు అందించేందుకు తుళ్లూరులో బసవతారకం కేన్సర్ ఆసుపత్రి నిర్మాణానికి భూమిపూజ చేశామన్నారు. విజయవాడ ఉత్సవ్ కమిటీ చైర్మన్ ముత్తవరపు మురళీకృష్ణ, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌కు అభినందనలు తెలిపారు. ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ సినీ, రాజకీయ, సేవారంగాల్లో బాలకృష్ణ విశేష సేవలందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. 50 ఏళ్లుగా హీరోగా నటిస్తూ గిన్నిస్ బుక్ రికార్డ్ సాధించడం గర్వకారణమన్నారు. మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ మాట్లాడుతూ విజయవాడ ఉత్సవ్‌లో గొల్లపూడిని భాగస్వామ్యం చేయడం ఆనందదాయకమన్నారు. 70 ఏళ్ల నుంచి ఇక్కడి భూమిని కౌలు చేసుకుంటున్న రైతులు.. అడిగిన వెంటనే 10 నిమిషాల్లో స్థలం ఇవ్వడం గొప్ప విషయమన్నారు. గ్రేటర్ విజయవాడలో భాగంగా వచ్చే దసరా ఉత్సవాల నాటికి కొండపల్లి వరకు విజయవాడలో కలుస్తుందన్నారు. అమ్మవారి సన్నిధిలోకి గొల్లపూడే కాకుండా మైలవరం నియోజకవర్గం కూడా వస్తుందని చెప్పారు. దక్షిణ భారతదేశంలోనే విజయవాడ ఓ మంచి నగరం అవుతుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. చంద్రబాబు, లోకేశ్ కృషితో విజయవాడ ఉత్సవాలు రానున్న రోజుల్లో మరింత వన్నె తెస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, శ్రీరామ్ రాజగోపాల్, కూటమి నేతలు కొమ్మారెడ్డి పట్టాభి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు బొమ్మసాని సుబ్బారావు, జంపాల సీతారామయ్య, నర్రా వాసు, నూతలపాటి బాలకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	232
చికెన్ స్కిన్‌లెస్	242

నెక్ కోడిగుడ్ల ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 550

కాల్వల మరమ్మతులకు రూ. 2.12 కోట్లు : ఎమ్మెల్యే బోడె

కంకిపాడు : నియోజకవర్గంలోని పలు సాగు నీటి కాలువల మరమ్మతులకు కూటమి ప్రభుత్వం రూ. 2.12 కోట్ల మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తెలిపారు. స్థానిక విలేకరులతో శనివారం ఆయన మాట్లాడుతూ, గతంలో వచ్చిన అకాల వర్షాలు, వరదల కారణంగా నియోజకవర్గంలోని అనేక ప్రాంతాలు నీట మునిగాయన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. ఈ వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలకు శాశ్వత పరిష్కారం చేపట్టాలని కోరుతూ అసెంబ్లీ సమావేశంలో స్పీకర్ ద్వారా కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని తెలియజేశారు. స్పందించిన ప్రభుత్వం వరద ప్రభావితమైన 7 ప్రాంతాలల్లో సాగు నీటి కాలువల మరమ్మతులకు రూ. 2.12 కోట్లు మంజూరు చేస్తూ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి. సాయి ప్రసాద్ జీవో విడుదల చేసినట్లు తెలిపారు.

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దు

● ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ

హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ విద్యా సా గర్ నాయుడు అన్నారు. శనివారం ఆయన హనుమాన్‌జంక్షన్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఎస్పీగా బాధ్యతలు తీసుకున్న తరువాత మొదటిసారిగా పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. రికా ర్డులు పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం సర్కిల్ పోలీస్ కార్యాలయం నూతన భవనాన్ని కూడా సందర్శించారు. కార్యక్రమంలో గన్నవరం డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావు, ఎస్సై వి.సురేష్ తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తత అవసరం



ఉయ్యూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సమాజంలో నేడు జరుగుతున్న సైబర్ నేరాల పట్ల అవగాహన ఉండటం ద్వారా ఆయా నేరాలు అరికట్టవచ్చని ఉయ్యూరు సీఐ టీవీవీ రామారావు అన్నారు. శ్రీవిశ్వశాంతి స్కూల్ ఆవరణలో 8వ ఆంధ్ర ఎయిర్‌స్క్వాడ్రన్ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో జరుగుతున్న వార్షిక శిక్షణ కార్యక్రమంలో శనివారం ఆయన పాల్గొని సైబర్ సెక్యూరిటీ క్రైమ్ పట్ల క్యాడెట్లకు అవ గాహన కల్పించారు. జెడబ్ల్యు అధికారి సూరజ్, జీసీఐ హారిక, పీఐ స్టాఫ్‌బిస్ట్, కల్పన, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

వాహనం ఢీకొని గుర్తుతెలియని భవానీ మృతి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి) : అంపాపురం వద్ద గల పతంజలి ఆయిల్ ఫ్యాక్టరీ ఎదురుగా జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో భవానీ మాలదారుడు మృతి చెందిన ఘటన శనివారం రాత్రి జరిగింది. వీరవల్లి ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. భవానీ మాలలో ఉన్న గుర్తుతెలియని వ్యక్తి అంపాపురం వద్ద గల పతంజలి ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఎదురుగా రోడ్డు క్రాస్ చేస్తుండగా. విజయవాడ వైపు నుంచి ఏలూరు వైపునకు వెళుతున్న గుర్తుతెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. సుమారు 60 ఏళ్ల కలిగిన మృతుని జేబులో రూ.100 నోటు తప్ప వివరాలు తెలిపే ఆధారాలు లభ్యం కాలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

పెదఅవుటపల్లిలో హెల్త్ క్యాంప్



ఉంగుటూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య సమస్యల పట్ల అశ్రద్ధ తగదని, సకాలంలో సరైన వైద్యం చేయించుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని బీజేపీ కృష్ణాజిల్లా అధ్యక్షులు తాతినేని శ్రీరామ్ అన్నారు. ప్రధాని మోదీ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని బీజేపీ నాయకులు రాజా వాసిరెడ్డి మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో మండలంలోని పెద అవుటపల్లి ఎంపీపీ పాఠశాలలో శనివారం ఉచిత వైద్యశిబిరం, రక్తదాన శిబిరం నిర్వహించారు. క్యాపిటల్ హాస్పిటల్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో స్థానిక ప్రజలకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. రక్తదాన శిబిరంలో స్థానిక బీజేపీ కార్యకర్తలు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గుత్తికొండ రాజాబాబు, బూచిరాజు, తేలప్రోలు పీఏసీఎస్ చైర్‌పర్సన్ అరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి, హెచ్ఎం సుబ్బారావు, క్యాపిటల్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ గిరీష్, డాక్టర్ హేమతేజ, డాక్టర్ అలేఖ్య, డాక్టర్ దినేష్, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విలేకరి మృతి



శ్రీనివాస్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

గన్నవరం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో విలేకరి మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. స్థానిక గౌడపేటకు చెందిన నెక్కలపు శ్రీనివాసరావు(52) ఒకపత్రికలో విలేకరిగా పని చేస్తూనే.. వీకే ఆర్ కళాశాలలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం కళాశాల విధులకు హాజరై తిరిగి బైక్‌పై గన్నవరం బయలుదేరాడు. దుర్గాపురంలోని హెచ్‌సీఎల్ వద్ద జాతీయ రహదారిపై వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ అతని బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శివప్రసాద్ తెలిపారు.

కాలినడక భవానీలకు సేవాశిబిరం ప్రారంభం



హనుమాన్‌జంక్షన్‌రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కనకదుర్గమ్మ దర్శించుకునేందు కు సుదూర ప్రాంతాల నుంచి కా లినడక వచ్చే భక్తులకు సేవలందించడం అమ్మవారి కృపతోనే సాధ్యమవుతున్నదని వీహెచ్‌పీ జాతీయ ట్రస్టీ పుట్టగుంట సతీష్‌కుమార్ తెలిపారు. బొమ్ములూరు వద్ద జాతీయ రహదారి పక్కనగల ఫ్యాక్టరీలో సేవా శిబిరాన్ని శనివారం కుమారుడు అతీష్‌తో కలిసి ప్రత్యేక పూజ చేసి అన్నప్రసాద వితరణను ప్రారంభించారు. దూరాభారం నుంచి వచ్చే భక్తులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ, సాయంత్రం అల్పాహారం ఏర్పాటు చేయడంతో పాటు విశ్రాంతికి వసతి, అవసరమైన వైద్య సేవలందించేందుకు ప్రత్యేకంగా వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు వివరించారు.

ఆరోగ్యవంతమైన సమాజం నిర్మించాలి

హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని బాపులపాడు ఎంపీపీ వై.నగేష్ తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రీయ పోషణమాసం కార్యక్రమంలో భాగంగా శనివారం మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. గన్నవరం సీడీపీవో జి.మంగమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు కె.గంగాభవాని, ఎంపీడీవో కె. జోగేశ్వరరావు, ఇన్‌చార్జి తహసీల్దార్ రాజేందర్, పీఆర్ ఏఈ జయరాజు, వెలుగు ఏపీఎం శ్రీనివాసరావు, అంగన్వాడీ సూపర్ వైజర్లు శాంతికృష్ణ, సుమిత్ర, ఝాన్సీ అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉయ్యూరు: మహిళలు, పిల్లలకు పౌష్టికాహారం ఎంతో అవసరమని ఇన్‌చార్జ్ ఎంపీడీవో లోయ శివశంకర్ అన్నారు. పోషణ్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శనివారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని పోషక విలువల ఆహారంపై మాట్లాడారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బేబీ సరోజిని ఏపీఎం అమరేశ్వరరావు, సూపర్‌వైజర్ రాఘవమ్మ, ఈవోపీఆర్డీ కోటేశ్వరరావు, డాక్టర్ వీణ, సీసీ నాగేశ్వరరావు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పెనమలూరు: కంకిపాడు ఐసీడీఎస్ పరిధిలోని యనమలకుదురులో పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా యనమలకుదురు-1 సచివాలయంలో ఎనిమిదవ రాష్ట్రీయ పోషణ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులకు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సులోచనారాణి, డాక్టర్ వజ్రకుమారి, డాక్టర్ హారిక, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



రామవరప్పాడు పేరంటాలమ్మ.. కానూరు పార్వతీదేవి.. జంక్షన్ రాజరాజేశ్వరీదేవి.. గన్నవరంలో..ఆత్కూరులో.. ఉయ్యూరులో సామూహిక కుంకుమార్చన

శ్రీలలితాత్రిపుర సుందరీదేవిగా పేరంటాలమ్మ

ప్రసాదంపాడు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రామవరప్పాడులోని శ్రీవెంకమ్మ పేరంటాలు అమ్మవారిని దసరా శరన్నవరాత్రి సందర్భంగా శ్రీలలితాత్రిపుర సుందరీదేవిగా శనివారం అలకరించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారని ఈవో ప్రియాంక తెలిపారు.

కానూరు : తాడిగడప మున్సిపాలిటీ కానూరులోని పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజైన శనివారం పార్వతి అమ్మవారు లలితా త్రిపుర సుందరీదేవిగా అలంకృతులయ్యారు. ఈ సందర్భంగా మహిళలు అమ్మవారికి సహస్ర కుంకుమార్చన పూజ నిర్వహించారు. ఆలయ పూజారులు ఫణి, కృష్ణ ఫణిలు పూజా క్రతువులు నిర్వహించారు.

హనుమాన్‌జంక్షన్: దేవీనవరాత్రులు సందర్భంగా స్థానిక నూజివీడు రోడ్డులోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం రాజరాజేశ్వరీదేవిని, మహాలక్ష్మిగా అలంకరించి ఘనంగా పూజలు నిర్వహించారు. ఏలూరు రోడ్డులోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆర్యవైశ్య కల్యాణ మండపం, బాపులపాడు శ్రీభ్రమరాంబ సమేత శ్రీశైల మల్లికార్జునస్వామి ఆలయాల్లో అమ్మవారిని లలిత త్రిపుర సుందరీదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్: వడిచర్లలోని మల్లికార్జున స్వామి ఆలయంలో లక్ష్మీ, సరస్వతులతో ఉన్న శ్రీలలితత్రిపురసుందరీదేవి అలంకరణలో అమ్మవారికి ప్రత్యేక పూజ నిర్వహించారు. రంగన్నగూడెంలో అమ్మవారికి సర్పంచ్ కసుకుర్తి రంగామణి, అర్జున రావు దంపతులు ప్రత్యేకపూజ నిర్వహించారు. మల్లవల్లిలో రాజరాజేశ్వరిగా అలంకరించిన అమ్మవారికి విద్యాకమిటీ చైర్మన్ అచ్చి రమేష్ దంపతులు ప్రత్యేకపూజ నిర్వహించారు.

గన్నవరం శ్రీదేవి శరన్నవరాత్రుల మహో త్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారు శ్రీలలితా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీగాయత్రి మందిరంలో అమ్మవారిని శ్రీలలితాత్రిపుర సుందరీదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. శ్రీలక్ష్మీ తిరుపతమ్మ ఆలయంలో అమ్మవారి సన్నిధిలో మహిళలచే సామూహిక శ్రీలలితా సహస్రనామ పారాయణం, కుంకుమార్చనలు నిర్వహించారు. శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీలలితాత్రిపురసుందరీదేవికి తామర పుష్పాలతో పూజలు జరిపారు.

ఉంగుటూరు : దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం ఆత్కూరు శ్రీకనకదుర్గాదేవి ఆలయం, లంకపల్లి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శ్రీ లలితా త్రిపురసుందరీదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

ఉయ్యూరు: ఉయ్యూరు, మండల పరిధి గ్రామాల్లో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శ్రీజగదాంబ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో అన్నపూర్ణదేవిగా అలంకరించారు. చిన ఓగిరాల చింతలతోటలో అమ్మవారికి నిర్వహించిన పూజలో స్థానిక టీడీపీ నాయకులు ఏడుకొండలు, రామకృష్ణ పాల్గొన్నారు. గండిగుంటలో అమ్మవారిని దేవిగా అలంకరించగా నూకల సాంబశివరావు, వంశీ దంపతులు పూజలో పాల్గొన్నారు. ఉయ్యూరులో వంశీరాయల్ సిటీ ఆవరణలో జరుగుతున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారికి ప్రత్యేకపూజలు, సామూహిక కుంకుమార్చన నిర్వహించారు.

అమ్మవారి ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలి: ఏఎంసీ చైర్మన్



హనుమాన్‌జంక్షన్‌రూరల్: దుర్గమ్మ ఆశీస్సులతో పాడిపంటలు సమృద్ధిగా పండి రైతులు, ప్రజలు సుఖశాంతులతో సుభిక్షంగా ఉండాలని ఏఎంసీ చైర్మన్ గూడవల్లి నరసింహారావు అన్నారు. రేమల్లెలో నిర్వహిస్తున్న దసరా శరన్నవరాత్రి మహోత్సవ ప్రత్యేక పూజలో డైరెక్టర్లతో కలిసి ఆయన శనివారం పాల్గొన్నారు. స్థానిక నాయకుడు, ఏఎంసీ డైరెక్టర్ ఆదియ్య ఆధ్వర్యం లో చైర్మన్ నరసింహారావు, డైరెక్టర్లకు అమ్మవారి శేషవస్త్రాన్ని, ప్రసాదాలను అర్చకులు అందజేశారు. ఏఎంసీ వైస్ చైర్మన్ కొండేటి వెంకటేశ్వ రరావు, డైరెక్టర్లు గార్లపాటి రాజేశ్వరరావు, మున్నంగి బాబూరావు, కోటేశ్వరరావు, సూర్యకుమారి, గుజ్జర్లపూడి బాబూరావు, కొల్లూరి చంద్రకాంత్, తదితరులు పాల్గొన్నారు.





వెలగపూడి శంకరబాబును అభినందిస్తున్న కానూరువాసులు

శంకరబాబుకు అభినందన

కానూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ కనకదుర్గ ఆలయ కమిటీ సభ్యులుగా నియమితులైన టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబును శనివారం పలువురు కానూరువాసులు అభినందించారు. కానూరులోని ఆయన నివాసంలో కానూరువాసులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి స్వీట్‌లు తినిపించి సత్కరించారు. మాజీ ఎంపీటీసీ కణజం కొండ, పువ్వాడ రమేష్, రామకృష్ణ, శ్రీహరి పవన్, రియాజ్, సమీర్, రాఘవేంద్రరావు తదితరులు శంకరబాబు దంపతులను అభినందించిన వారిలో ఉన్నారు.

మర్యాదపూర్వక కలయిక



ఎమ్మెల్యే సుజనాచౌదరితో వీసీ వెంకటేశ్వర్లు

పెనమలూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని తుంకూర్ యూనివర్సిటీ వీసీ వెంకటేశ్వర్లు విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనాచౌదరిని మర్యాదపూర్వకంగా కలిశారు. తాడిగడపలోని ఎమ్మెల్యే సుజనా కార్యాలయంలో వీసీ వెంకటేశ్వర్లు కలిసి పలు విషయాలపై చర్చించారు.



ఎమ్మెల్యే బోడెకు కృతజ్ఞతలు చెబుతున్న అన్నవరపు శివపార్వతి తదితరులు

కష్టపడిన ప్రతి ఒక్కరికి గుర్తింపు

కంకిపాడు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పార్టీకి కష్టపడిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందని దుర్గగుడి పాలక మండలి సభ్యురాలుగా నియమితులైన అన్నవరపు శివపార్వతి అన్నారు. శనివారం పోరంకి పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో శివపార్వతి మాట్లాడుతూ పార్టీ అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా పార్టీ బలోపేతం కోసం కష్టపడి పని చేసిన ప్రతి ఒక్కరినీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ గుర్తించి సముచిత స్థానం కల్పిస్తున్నారని అభినందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు సంగెపు రంగారావు, వణుకూరు విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.



ఈక్రాప్ నమోదును క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న డీడీఏ మనోహరరావు,ఏవో రంగనాథ్‌బాబు

ఈక్రాప్ నమోదు తప్పనిసరి

ఉయ్యూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన పంట రైతు సహాయక కేంద్రాల్లో తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని ఉయ్యూరు ఆర్డీవో బి.హేలాషారోన్ అన్నారు. ఉయ్యూరు పరిధిలో జరుగుతున్న పంట నమోదు ప్రక్రియను గన్నవరం ఏడీఏ సునీల్‌తో కలసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ, పంటనమోదు ప్రక్రియ ఈ నెల 30తో ముగుస్తుందని, రైతులు తప్పనిసరిగా తాము పండించిన పంట రైతు సేవాకేంద్రాల్లో నమోదు చేయించుకుని మండల, గ్రామ స్థాయి అధికారులతో సహకరించాలన్నారు. ఏవో నిస్సీగ్రేస్ సహాయకులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : ప్రభుత్వం అందించే ఇన్‌పుట్ సబ్సిడీ, ఇతర పథకాలు అందాలన్నా, అకాల వర్షాలకు పంట నష్టం నివారించాలన్నా రైతులందరూ ఈక్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించు కోవాలని డీడీఏ (డిప్యూటీ డైరెక్టర్ ఫర్ అగ్రికల్చర్) మనోహరరావు సూచించారు. వీరవల్లి, తిప్పగుంట గ్రామాల్లో శనివారం ఈక్రాప్ నమోదును ఏవో రంగనాథ్‌బాబుతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అంబరాన్నంటిన సంబరాలు





- పున్నమిలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రదర్శనలు
- ఘంటసాలలో అలరించిన పౌరాణికాలు
- తుమ్మలపల్లిలో ఘల్లుమన్న జానపదం
- సంగమంలో ఆకట్టుకున్న కోలాట ప్రదర్శనలు

ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ /విజయవాడ కల్చరల్: సాంస్కృతిక ఆనందం పతాక స్థాయికి చేరింది. ఆకాశమే హద్దుగా ఆనందం ఉప్పొంగింది. విజయవాడ ఉత్సవ్ జోష్ సరికొత్త రూపం సంతరించుకుంది. పున్నమిఘాట్‌లో ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రదర్శనలు, దాండియా ఓలలాడించగా తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జానపదాలు ఝల్లుమన్నాయి. సంగీత కళాశాలలో పౌరాణిక నాటకాలు రక్తికట్టించగా పవిత్రసంగమంలో కోలాట నృత్యాలు సందడి చేశాయి కనకదుర్గానగర్‌లో దేవీస్తుతి నృత్యాలు ఆకట్టుకున్నాయి.

పున్నమిఘాట్‌లో..

విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా శనివారం రాత్రి పున్నమిఘాట్ సందడిగా మారింది. పవిత్ర కృష్ణాతీరం వద్ద జరిగిన సాంస్కృతిక విందు ఆధ్యాత్మికత, కళ, వినోదం ప్రేక్షకులను అలరించింది. నలందా టీమ్ మహిళా బృందం ప్రదర్శించిన 'అయిగిరి నందిని' నృత్యం వేదికను మంత్రముగ్ధం చేసింది. శక్తి స్వరూపిణి మహాదేవి వైభవాన్ని ప్రతిబింబిస్తూ ఆ బృందం సమన్వయంతో చేసిన ఆరాధనాత్మక నృత్యం ఘాట్ వాతావరణాన్ని ఆధ్యాత్మికతతో నింపింది. చిన్నా పెద్దా అందరూ కలిసి ఆడిపాడుతూ వేదికను భక్తిరసంతో నింపారు. కృష్ణా తీరం మీద ఆకాశాన్ని వెలుగులతో అలరించిన డ్రోన్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.స్థానిక కళాకారులు ప్రదర్శించిన గరగల నృత్యం సంప్రదాయ కాంతిని చాటింది. తాళం, లయ, శక్తి సమన్వయంతో సాగిన ఈ నృత్యం ఉర్రూతలూగించింది. ప్రముఖ గాయని సమీరా భరద్వాజ్ లైవ్ పెర్ఫార్మెన్స్ ఘాట్ సందడిని మరింత పెంచింది. ఆమె అద్భుతమైన గాత్రంతో భక్తి, సినీ పాటలు పాడగా ప్రేక్షకులు ఉత్సాహంగా ఆలకించి చప్పట్లతో అభినందించారు.

పవిత్ర సంగమంలో..

పవిత్ర సంగమంలో జానపదం ఘల్లుమంది. కొండపల్లి మునిసిపాలిటీ ఆధ్వర్యంలో దసరా నవరాత్రుల పురస్కరించుకొని నిర్వహిస్తున్న విజయనర్తనంలో భాగంగా 6వ రోజు శనివారం ఆరు బృందాలు జానపద ప్రదర్శనలిచ్చి ప్రేక్షకులను తన్మయులను చేశారు. నగరానికి చెందిన సుభద్ర, శాంభవి బృందం ప్రదర్శించిన కోలాటం ఉర్రూత లూగించింది. కళాక్షేత్ర డాన్స్ అకాడమీ బృందం ప్రదర్శించిన నాట్యాలు ఆకట్టుకున్నాయి. అనురాధ శిష్య బృందంచే కూచిపూడి, జానపదం అలరించగా, మంజుల పద్మజా హైదరాబాద్ బృందం గరిమెల్ల పద్మప్రియ వరంగల్ బృందం కూచిపూడి జానపదం నృత్యాలు ప్రదర్శించి మైమరపించారు. కళాకారులను కొండపల్లి మున్సిపాలిటీ ఛైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, కమిషనర్ రమ్య కీర్తన సత్కరించారు.

ఘంటసాల సంగీత కళాశాలలో..

హైదరాబాద్‌కు చెందిన కళాక్షేత్రం బృందం ఆంధ్ర నాకెంతో కుంభహారతి ఆనంద నర్తన గణపతి అష్టదిక్పాలక, దశావతారాలు అంశాలతో అలరించారు. తదుపరి ఉషామాధవి కూచిపూడి నాట్యం నర్తించారు. తదుపరి రాజమండ్రి చెందిన సుబ్బలక్ష్మి బుర్రకథ గానం చేశారు. దక్ష యజ్ఞం కథను గానం చేస్తుండగా శ్రీనివాసరాజు, లోవరాజు వంతకులుగా సహకరించారు. కాకినాడ ఏవీ సుబ్బారావు ప్రదర్శించిన తోలు బొమ్మలాట ఆకట్టుకుంది. చివరిగా ప్రదర్శించిన శ్రీకృష్ణ తులాభారం పౌరాణిక నాటకం రక్తి కట్టించింది.



తుమ్మలపల్లి కళాక్షేత్రంలో..

దళిత సింధూరి సోలో నాట్యంతో సంధ్య తాండవం చేయగా, ఆగిరిపల్లికి చెందిన దేవీ భవాని తన బృందంతో గణపతి స్తుతి బాలా త్రిపుర సుందరి కీర్తనలకు నయనానందకర నర్తించి అలరించారు. సత్యనారాయణపురం ఘంటసాల సంగీత కళాశాల విద్యార్థుల బృందం వీణ వాదనతో శ్రోతలను పరవశింపజేశారు. త్యాగరాజ కృతులను అత్యంత మాధురీయంగా వేణవాదలతో వినిపించారు. కోనసీమకు చెందిన వీబీఎస్‌వీ కుమార్ ఆలయ సంప్రదాయ నృత్యం అయిన గరగలతో బృంద నృత్యాలు చేసి ఆకట్టుకున్నారు. విశాఖపట్నా చెందిన అత్తరు హాస్సేన్ మ్యాజిక్ షో ప్రేక్షక ప్రశంసలు అందుకుంది. రాజమండ్రికి చెందిన అనపర్తి భీమన్న తోలుబొమ్మలాట రామాయణం అంశంతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఇంద్రకీలాద్రిపై..

దసరా ఉత్సవాలను పురస్కరించుకొని దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో కొండ దిగువన ఏర్పాటు చేసిన కళా వేదికపై కళా బృందాలు తమ కళలను ప్రదర్శిస్తూ జగన్మాతకు కళా నీరాజనాలు సమర్పిస్తున్నారు. ఉదయం 10 నుంచి కృష్ణాజిల్లా చల్లపల్లికి చెందిన బీ సామా జ్యం బృందం తాళం భజన, తూర్పు గోదావరి జిల్లా అన్నవరం వెంపటి లలితా నాగమణి బృందం భక్తి సంగీతం, విజయవాడకు చెందిన పీ సాత్విక్ మహాదేశ్వర్ భక్తి రంజని కార్యక్రమం, వీ నీరజ బృందం గాత్ర కచేరి హృద్యంగా సాగాయి. మధ్యాహ్నం విశాఖపట్నానికి చెందిన తులసి భాగవతారిణి గానం చేసిన రుద్రాక్షమహిమ అనే హరికథ భక్తులను భక్తిపారవశ్యంలో ముంచెత్తింది. ఎం పార్వతి, సౌందర్య, పూజ శ్రీ, విజయ గౌరీ, పావనీ లత, లలితా దేవి బృందాలు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు అలరించాయి.





విజయవాడ ఉత్సవ్‌లో నేటి ప్రదర్శనలు

విజయవాడ: విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా 7వ రోజు ఆదివారం సాయంత్రం నుంచి ప్రారంభమయ్యే కార్యక్రమాలు

గొల్లపూడిలో ఆదివారం సాయంత్రం ప్రముఖ సింగర్ రామ్ మిరియాల లైవ్ మ్యూజిక్ కన్సర్ట్, **పున్నమిఘాట్‌లో** కాళిక వేషాల ప్రదర్శన, కాంతార పెర్ఫామెన్స్, సందీప్ నారాయన్ లైవ్ మ్యూజిక్ షో, దాండియా డీజే, **తుమ్మలపల్లి వేదికగా..** సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్‌కు చెందిన నాట్యాచారిణి స్నేహలత బృందంతో కూచిపూడి నాట్య ప్రదర్శన, 6.30 గంటలకు సంగీత కచేరి, రాత్రి 7 గంటలకు నగరానికి చెందిన లేఖ్యభరణి కూచిపూడి నృత్యప్రదర్శన, 7.30 గంటలకు వెంకట్ మ్యాజిక్ షో, 8 గంటలకు కోనసీమ జిల్లాకు చెందిన పీబీసీకే కుమార్‌తో గరగలు ప్రదర్శన, 8.30 గంటలకు పెద్దాపురానికి చెందిన వనపర్తి కోటేశ్వరరావు బృందంతో తోలుబొమ్మలాట, 9 గంటలకు ఆయాచితల కల్చరల్ ఫౌండేషన్, విజయవాడ వారి సాంఘిక హాస్య నాటిక పెళ్లి

ఘంటసాల ప్రభుత్వ కళాశాల వేదికగా..

సాయంత్రం 6 గంటలకు నగరానికి చెందిన యామిని సిస్టర్స్ శిష్య బృందంతో కూచిపూడి నృత్య ప్రదర్శన, 6.30 గంటలకు జీవీఆర్ సంగీత, మ్యూజిక్ కచేరి, రాత్రి 7 గంటలకు బి.వెంకట రామశర్మ కూచిపూడి నృత్య ప్రదర్శన, 7.30 గంటలకు నెల్లూరుకు చెందిన డి.హరిబాబు హాస్యవల్లరి, 8 గంటలకు తాడేపల్లిగూడెంకు చెందిన వై.విజయ్‌కుమార్ ఫోక్‌సాంగ్స్, 8.30 గంటలకు శ్రీ సమతా నాటక గురుకుల నాట్యమండలి, గుంటూరు వారిచే చారిత్రక నాటకం పల్నాటి యుద్ధం.



ఆకట్టుకున్న మహిషాసుర మర్దినీ నృత్య రూపకం

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గొల్లపూడి ఎగ్జిబిషన్‌లో సాంస్కృతిక ప్రదర్శనల్లో భాగంగా సత్య మాస్టర్ బృందం చేసిన మహిషాసురమర్దిని నృత్య రూపకం భక్తులను, వీక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. మహిషాసురిడ్ని వధించే తీరు కళాకారులు కళ్లకు కట్టినట్లు చూపించారు. ఈ నృత్యరూపకం చూసిన భక్తులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. అలాగే కాళీకామాత వేషధారణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. డప్పు వాయిద్యాల మధ్య కాళీకామాత వేషధారణలో ఉన్న కళాకారులు చేసిన నృత్యంతో ఎక్స్‌పో ప్రారంభమైంది. నిర్వాహకులు శ్రేయస్ శ్రీనివాస్‌ను కళాకారులు ఆశీర్వదించారు. ఎక్స్‌పోకు వస్తున్న ముఖ్య అతిథులకు, వీవీఐపీలకు, వీఐపీలకు, ప్రతి ఒక్కరికీ స్వాగతం పలికేందుకు స్వాగత ద్వారం వద్ద ఉంచిన దసరా వేషగాళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

ఊపేసిన సింగర్ సునీత పాటలు

- జన్మనిచ్చిన భూమి విజయవాడ అంటూ భావోద్వేగం

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఎక్స్‌పో (గొల్లపూడి ఎగ్జిబిషన్) శనివారం సింగర్ సునీత లైవ్ మ్యూజిక్ షో భక్తులను, యువతను విశేషంగా ఆకట్టుకుంది. తొలి పాటగా తన సహచర సింగర్ ధనుంజయ్‌తో ఆమె పారాణి పాదాల బాలాకృతి పరమందు కొలువైన పరమేశ్వరి అని అమ్మవారిపై పాడిన పాటతో వీక్షకులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. దసరా వచ్చిందయ్యా సరదా తెచ్చిందయ్యా, ఓంకార నాదాలు సంధానమో గానమే, మధుర మధుర మీనాక్షి అనే భక్తి పాటలు పాడారు. అనంతరం యువత కోసం అందంగా లేనా అసలేం బాలేనా, చిన్ని చిన్ని ఆశ చిన్నదని ఆశ ముద్దు ముద్దు ఆశ ముత్యమంత ఆశ, కమ్మనీ ప్రేమ లేఖనే రాసింది హృదయమే, అవును నిజం నువ్వంటే నాకిష్టం పాటలు పాడారు. మొత్తం 30 పాటల వరకు పాడి యువతను, ప్రేక్షకులను ఉర్రూతలూగించారు.

నా జన్మస్థలం విజయవాడ

నేను పుట్టి పెరిగి సంగీతం నేర్చుకున్న విజయవాడలో గానం చేయడం ఎంతో ఆనందంగా ఉందని సింగర్ సునీత భావోద్వేగానికి గురయ్యారు. దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని దర్శించుకోవడం ఎంతో సంతోషాన్నిచ్చిందని, విజయవాడలో ఉండి ప్రతిరోజూ అమ్మవారిని దర్శించుకుంటున్న మీరంతా అదృష్టవంతులన్నారు. నాలా ఎందరో సింగర్స్ విజయవాడ నుంచి రావాలని ఆకాంక్షించారు.

హెలీరైడ్.. యమా క్రేజ్



విజయవాడ కల్చరల్: విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా నగరంలో నిర్వహిస్తున్న హెలికాప్టర్ రైడ్స్‌కు యమా క్రేజ్ నెలకొంది. హెలికాప్టర్ ఎక్కేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. సెప్టెంబర్ 22 నుంచి ప్రారంభమైన ఈ రైడ్స్ అక్టోబర్ 2 వరకు నిర్వహించనున్నారు. కృష్ణానది, ప్రకాశం బ్యారేజ్, భవానీ ద్వీపం, దుర్గగుడి ప్రాంతం, గాంధీహిల్ మీదుగా నగర సుందర, పర్యాటక దృశ్యాలను ఆకాశం నుంచి ఆస్వాదించే అవకాశాన్ని అందిస్తున్నాయి. రోజుకు 17 నుంచి 20 ట్రిప్‌ల వరకు బుకింగ్‌లు జరుగుతున్నాయి. శనివారం, ఆదివారం అయితే ఈ ట్రిప్పుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని నిర్వాహకులు సూర్య తెలిపారు. ప్రతి రైడ్‌లో పైలట్ తప్ప 6 మంది ప్రయాణికులు పాల్గొనవచ్చునన్నారు. వాతావరణం పరిస్థితుల్ని బట్టి రోజుకు 45 ట్రిప్పుల వరకు వేయగల సామర్థ్యం ఉందన్నారు. 6 నుంచి 7 నిమిషాల వరకు హెలీ రైడ్ ఉంటుంది. స్టేడియం నుంచి ప్రారంభమౌతాయి. టికెట్ ధర ఒక్కొక్కరికి రూ.5వేలుగా నిర్ణయించారు.

ఈ-క్రాప్ నమోదును వేగవంతం చేయండి

- కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ-క్రాప్ నమోదును వేగవంతంగా పూర్తిచేయాలని కలెక్టర్ బాలాజీ వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశపుహాలులో శనివారం వివిధశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలు, పంటబీమా, పంట నష్టపరిహారం అమలు చేసేందుకు ఈ-క్రాప్‌లో నమోదైన వివరాలనే పరిగణనలోకి తీసుకుంటారన్నారు ఇంతటి కీలకమైన ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను ఆలస్యం చేయకుండా గడువులోగా పూర్తి చేయాలన్నారు. సీఎం చంద్రబాబు కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలు, సంక్షేమ కార్యక్రమాల అమలును సక్రమంగా చేయాలని ఆదేశించారన్నారు. అధికారులు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్, తల్లికి వందనం పథకాల అమలులో సాంకేతికపరంగా ఏమైనా ఇబ్బందులు ఉంటే పరిష్కరించేందుకు అధికారులు చొరవ చూపాలన్నారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

హస్తకళలను కాపాడుకోవాలి

- సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి

విద్యాధరపురం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దేశ సంస్కృతిలో భాగమైన హస్తకళలలు కనుమరుగు కాకుండా కాపాడుకోవాలని సీఆర్‌మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్‌కుమార్ అన్నారు. భవానీపురంలోని బెరంపార్కులో శనివారం హస్తకళాకారులకు నిర్వహించిన ఒక రోజు వర్క్‌షాప్‌ను ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ దేశంలో భిన్న జాతులు, సంస్కృతుల మధ్య ఏకత్వానికి హస్తకళారూపాలు, నాట్య, సంగీత, సాహిత్యాలు తోడ్పతాయన్నారు. వెనకటి తరాల నుంచి వారసత్వంగా వచ్చిన కళను భావితరాలకు అందించాల్సి ఉందన్నారు. అమెజాన్ వంటి సంస్థల ద్వారా మన కళారూపాలు దేశ, విదేశాల్లో ఖ్యాతి పొందేందుకు కృషి చేయాలన్నారు. ఇందుకు దోహదం చేయడానికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇలాంటి వర్క్‌షాపులు నిర్వహిస్తున్నాయన్నారు. ప్రొఫెసర్ ఎం ఆదినారాయణ పలు సూచనలు చేశారు. ఏపీ హస్తకళ అభివృద్ధి సంస్థ సీనియర్ కన్సల్టెంట్ పీ సుధీర్ కుమార్, సీఆర్ మీడియా అకాడమీ మేనేజర్ ఎం భాస్కర నారాయణ పాల్గొన్నారు.

న్యాయవాదుల డెత్ బెనిఫిట్ పెంపును స్వాగతించిన ఐలూ

విజయవాడ లీగల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదుల డెత్ బెనిఫిట్‌ను రూ.6 లక్షల నుంచి రూ.9 లక్షలకు, మెడికల్ బెనిఫిట్‌ను రూ.1.50 లక్షల నుంచి 2.50 లక్షలకు పెంచుతూ బార్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ నిర్ణయం తీసుకోవడంపై అఖిల భారత న్యాయవాదుల సంఘం (ఐలూ) రాష్ట్ర అధ్యక్షుడు కే కుమార్, ప్రధాన కార్యదర్శి ఎన్ మాధవరావు శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన మ్యాచింగ్ గ్రాంట్‌ను రూ.9లక్షలకు పెంచేలా, ప్రభుత్వం నుంచి రావాల్సిన డెత్ బెనిఫిట్ బకాయిలను మృతిచెందిన సుమారు 1,175 మంది న్యాయవాదుల కుటుంబాలకు తక్షణం చెల్లింపులు చేసేలా ప్రభుత్వంపై బార్ కౌన్సిల్ ఒత్తిడి తేవాలని ఐలూ డిమాండ్ చేసింది. ఎన్టీఆర్ ఆరోగ్య భరోసా స్కీంను న్యాయవాదులకు వర్తించేలా, అర్హులైన జూనియర్ న్యాయవాదులకు స్టైఫండ్ చెల్లించేలా, ఇళ్లస్థలాలు కేటాయించేలా ప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలని ఐలూ నేతలు డిమాండ్ చేశారు.

దివ్యాంగులకు కొండంత కష్టం..!

- ఇంద్రకీలాద్రిపై దివ్యాంగులకు ఇబ్బందులు
- బ్యాటరీ కారు ఉన్నా తప్పని కష్టాలు

ఆంధ్రజ్యోతి - విజయవాడ: ఇంద్రకీలాద్రిపై దివ్యాంగులకు కష్టాలు తప్పడం లేదు. అమ్మవారి దర్శనానికి వచ్చిన వారికి ఓం మలుపు నుంచి కష్టాలు మొదలవుతున్నాయి. దివ్యాంగులు, వృద్ధులకు దేవస్థానం అధికారులు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. బస్సులో ఎక్కిన వారిని ఘాట్ రోడ్డు మీదుగా ఓం మలుపు వద్దకు తీసుకువెళ్లి అక్కడ దింపేస్తున్నారు. అక్కడి నుంచి వికలాంగులను డోనార్స్ సెల్ వరకు తీసుకెళ్లడానికి దేవస్థాన అధికారులు బ్యాటరీ కారు నడుపుతున్నారు. ఓం మలుపు వద్ద వారిని ఎక్కించుకుని డోనార్స్ సెల్ వరకు తీసుకెళ్తుంది. అక్కడి నుంచి పోలీసు సేవాదళ్ సేవకులు వీల్‌చైర్‌లో వారిని దర్శనానికి తీసుకెళ్తారు. అధికారులు ఒక బ్యాటరీ కారును మాత్రమే నడుపుతుండడంతో దివ్యాంగులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శనివారం ఓ దివ్యాంగుడు ఇద్దరు పిల్లలతో దర్శనానికి వచ్చాడు. బ్యాటరీ కారు కోసం ఓం మలుపు వద్ద చాలాసేపు వేచి చూశాడు. ఎంతకీ రాకపోవడంతో ఆయన తన ఇద్దరు పిల్లలతో పాకుతూ వెళ్లాడు. అతడి వెనుక నుంచి న్యాయశాఖకు చెందిన రెండు వాహనాలు వెళ్లాయి. బ్యాటరీ కారు చార్జింగ్ అయిపోవడంతో నడపలేదని సిబ్బంది చెప్పినట్టు ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు. దసరా ఉత్సవాలు ముగిసే వరకు ఓం మలుపు వద్ద మరో బ్యాటరీ కారును ఏర్పాటు చేయాలని దివ్యాంగులు, వృద్ధులు కోరుతున్నారు. దీనితోపాటు వీల్‌చైర్లను డోనార్స్ సెల్ దగ్గరే కాకుండా ఓం మలుపు వద్ద ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.





విద్యార్థి దశలోనే స్వాతంత్ర్య పోరాటం

- ఘనంగా మండలి వెంకట కృష్ణారావు 28వ వర్ధంతి

అవనిగడ్డ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలోనే స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుడు మండలి వెంకట కృష్ణారావు అని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక వంతెన సెంటర్‌లో ఆయన 28వ వర్ధంతి ఘనంగా జరిగింది. ఎస్‌వీఎల్ క్రాంతి విద్యాసంస్థల విద్యార్థులు పెద్దసంఖ్యలో వచ్చి కృష్ణారావు విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గాంధీ పిలుపుతో కృష్ణారావు విద్యార్థి దశలో అవనిగడ్డ హైస్కూలుపై జాతీయ జెండా ఎగురవేశారన్నారు. 1957లో మచిలీపట్నం నుంచి ఎంపీగా గెలిచి, అవనిగడ్డకు విద్యుత్ సౌకర్యం తెచ్చారన్నారు. 1958లోనే అవనిగడ్డకు టెలిఫోన్ సౌకర్యం తేవటంతో పాటు దివిసీమ గ్రామాలకు టెలిఫోన్ ఎక్స్ఛేంజీలు నిర్మించారన్నారు. అవనిగడ్డలో జూనియర్, డిగ్రీ కళాశాలల ఏర్పాటు చేసి దివిసీమలో విద్యావ్యాప్తికి కృషి చేశారని కొనియాడారు. కృష్ణారావు శతజయంతి కమిటీ, గాంధీక్షేత్రం, మండలి అభిమానుల ఆధ్వర్యంలో యువ నేతలు మండలి వెంకట్రామ్, ఎస్‌వీఎల్ క్రాంతి విద్యాసంస్థల చైర్మన్ దుట్టా ఉమామహేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు యాసం చిట్టిబాబు, జనసేన పార్టీ ఉమ్మడి కృష్ణా జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ రాజనాల వీరబాబు, డీసీ వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ ప్రసాద్, గాంధీక్షేత్రం కార్యదర్శి మత్తి శ్రీనివాసరావు, ఎంపీటీసీబొప్పన భాను, పీఏసీఎస్ అధ్యక్షుడు మాదివాడ రత్నారావు, యర్రంశెట్టి సుబ్బారావు, యలవర్తి చిన్నా, కూనపరెడ్డి చంద్రశేఖర్, రామిశెట్టి వేణుగోపాల్, బండే కనకదుర్గ, బచ్చు కృష్ణకుమారి, బండే రాఘవ, పరుచూరి దుర్గా ప్రసాద్, ఘంటసాల కన్నయ్య పాల్గొన్నారు.

కొత్త బస్సులు కొనుగోలు చేయండి

- మంత్రి అచ్చెన్నాయుడుకు యూనియన్ నేతల విజ్ఞప్తి

బస్టేషన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్త్రీ శక్తి పథకం సమర్థ అమలుకు కొత్త బస్సులను కొనుగోలు చేయాలని ప్రజారవాణా సంస్థ నేషనల్ మజ్దూర్ యూనియన్ నేతలు మంత్రి అచ్చెన్నాయుడుకు తెలిపారు. శనివారం యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సంయుక్త కార్యదర్శి రాజేష్‌కుమార్, సీసీఎస్ పాలకవర్గ సభ్యుడు అనంతరాములు, వినోద్‌కుమార్ బృందం మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా స్త్రీ శక్తి పథకం అమలులో సహకరిస్తున్నందుకు కృతజ్ఞతగా మంత్రిని సత్కరించారు. అనంతరం ఆయనకు వివిధ సమస్యలను వివరించారు. స్త్రీ శక్తి పథకం అమలుకు కొత్త బస్సులు కొనుగోలు చేయాలని, వాటి నిర్వహణ ఆర్టీసీ కిందే ఉంచాలని కోరారు. అలాగే ఉద్యోగ నియామకాల ప్రక్రియను చేపట్టాలని కోరారు. ఏపీఎస్‌ఆర్టీసీ క్రెడిట్ కోఆపరేటివ్ స్టోర్‌ను చక్కగా నిర్వహిస్తున్నందుకు సీసీఎస్ కమిటీని మంత్రి అభినందించారు. 2022 సెప్టెంబరు నెలలో ఉద్యోగుల జీతాల నుంచి రికవరీ చేసిన రూ 61.20 కోట్లను సీసీఎస్‌కు జమచేసేలా చూడాలన్నారు. మంత్రి స్పందిస్తూ గతంలోనూ ఈ అంశం తన దృష్టికి వచ్చిందని, ఆ వివరాలను తెలుసుకోవాలని తన పీఏను ఆదేశించారు. ఇదే సమయంలో నేతలిచ్చిన వినతి పత్రాలపై ఎండార్స్ చేశారు.



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ప్రజా రవాణా సంస్థ ఎన్ఎంయూ నేతలు

సంక్షేమ పథకాల్లో నిరుపేదలకు ప్రాధాన్యత

- అసెంబ్లీలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తాను నియోజకవర్గంలో తిరుగుతున్నప్పుడు తనకు కనిపించిన ఎంతో మంది నిరుపేద కుటుంబాలు తీవ్ర ఆర్థిక కష్టాల్లో జీవిస్తున్నారని, కొందరికి సంక్షేమ పథకాలు అందినా వాటితో జీవనం కొనసాగించలేని దుస్థితి కనిపిస్తోందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అసెంబ్లీలో ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే వ్యక్తి మాత్రమే ఉన్న కుటుంబాలు చిన్న చిన్న గుడిసెల్లో, వాడేసిన ఫ్లెక్సీలను ఇళ్లకు కప్పుకొని, ఎవరో ఇచ్చిన భోజనం తింటూ జీవనం సాగిస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయని, ఈ పరిస్థితులను నివారించడానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో ఆర్థికంగా అత్యంత వెనుకబడిన కుటుంబాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వానికి విన్నవించారు. ఆర్థికంగా స్థిరంగా ఉన్న కుటుంబాలు స్వచ్ఛందంగా పథకాలను వదిలిపెట్టి పేదలకు తమ వంతు సాయం అందేటట్లు చూడాలని ప్రభుత్వానికి విన్నవించారు. దీనికి పాజిటివ్‌గా స్పందించిన స్పీకర్ రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ గతంలో ప్రధాని మోదీ గ్యాస్ సిలిండర్ల విషయంలో ఇచ్చిన పిలుపు మేరకు కోట్ల సంఖ్యలో ప్రజలు స్పందించి తమ సబ్సిడీని వదులుకొని ప్రభుత్వానికి సహకరించారని గుర్తు చేశారు.

కృష్ణా మిల్క్ యూనియన్‌లో అక్రమాలపై చర్యలు తీసుకోండి

- అసెంబ్లీలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు
- శైవ ఆలయాల్లో నిత్యాభిషేకాలు చేయాలి

గన్నవరం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కృష్ణామిల్క్ యూనియన్‌లో జరుగుతున్న అక్రమాలపై తక్షణమే విచారణ జరిపి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రభుత్వాన్ని కోరారు. శాసనసభ వర్షాకాల సమావేశాల్లో భాగంగా శనివారం పలు అంశాలపై అసెంబ్లీలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థ అయిన విజయ డెయిరీ మ్యాక్స్ చట్టం ప్రకారం పలు డివిజన్లుగా పనిచేస్తోందని కృష్ణాజిల్లాలో కృష్ణా మిల్క్ యూనియన్‌గా సహకార రంగంలో ఉన్నట్టు వివరించారు. కృష్ణా మిల్క్ యూనియన్ దాణా కర్మాగారం నిర్మించేందుకు బాపులపాడు మండలం వీరవల్లిలో పొలం కొనుగోలు చేయగా అక్కడ పాల ఉత్పత్తుల ఫ్యాక్టరీ నిర్మించారన్నారు. భూమి కొనుగోలులో అనేక అక్రమాలు చోటు చేసుకున్నాయని యార్లగడ్డ సభ దృష్టికి తెచ్చారు. 2019లో ఎన్నికల ఫలితాలు వెలువడే ఒకరోజు ముందు యూనియన్ చైర్మన్‌గా ఎన్నికైన వ్యక్తి తనకు రాజకీయ పార్టీలతో సంబంధం లేదని తాను పాలపార్టీగా ప్రకటించుకుంటూ వైసీపీ నేతలు, కార్యకర్తలకు కంపెనీలో పెద్ద ఎత్తున ఉద్యోగాలు ఇవ్వటమే కాకుండా పాల బూత్‌లు సైతం వైసీపీ వాళ్లకే ఇచ్చారని ఆరోపించారు. వీటన్నింటిపై 6 నెలల క్రితమే పూర్తి ఆధారాలు అందజేశానన్నారు. రాష్ట్రంలోని పురావస్తుశాఖ ఆధీనంలోని ద్రాక్షారామం, భీమేశ్వరాలయం, గుడిమల్లం తదితర శైవ ఆలయాల్లో అనునిత్యం పంచామృత అభిషేకాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆలయాల్లో పనిచేస్తున్న అర్చకులకు వేతనాలు పెంచాలని ప్రభుత్వానికి యార్లగడ్డ విజ్ఞప్తి చేశారు.

చర్యలు తీసుకుంటాం: మంత్రి అచ్చెన్నాయుడు

యూనియన్ అక్రమాలపై యార్లగడ్డ విజ్ఞప్తికి స్పందించిన మంత్రి అచ్చెన్నాయుడు సదరు ఆరోపణలపై విచారణ జరుగుతుందని నివేదిక అందిన వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

గుడివాడ - పామర్రు

● గుడ్లవల్లేరు ● నందివాడ ● పెదపారుపూడి ● మొవ్వ

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	232
చికెన్ స్కిన్‌లెస్	242
నెక్ కోడిగుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ. 550	


ఎమ్మెల్యే సుజనాచౌదరిని సత్కరిస్తున్న ఆలయ అధికారి, అర్చకులు

పెదమద్దాలిలో ఎమ్మెల్యే సుజనాచౌదరి పూజలు

పామర్రు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): పెదమద్దాలిలో వేంచేసి యున్న ఉద్దండ వేణుగోపాలస్వామి దేవాలయంతోపాటు మల్లేశ్వరస్వామి దేవాలయాలను విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే యలమంచిలి సత్యనారాయణ(సుజనా చౌదరి)శనివారం స్వామి వార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాలు శిథిలావస్థకు చేరుకున్న విషయాన్ని గ్రామస్థులు ఆయన దృష్టికి తీసుకురావటంతో ఆలయాల పునర్నిర్మాణానికి తన వంతు చేయూతనందిస్తానని హామీ ఇచ్చారు. ఆలయ అధికారి జన్ను వెంకటేశ్వరరావు, అర్చకులు పాల్గొన్నారు.


బాస్కెట్‌బాల్ పోటీలను ప్రారంభిస్తున్న స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు

బాస్కెట్‌బాల్ రాష్ట్ర పోటీలు ప్రారంభం

గుడివాడ, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): క్రీడాకారుల్లోని నైపుణ్యాన్ని వెలికితీసేలా స్టేడియం కమిటీ కృషి చేస్తోందని ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు అన్నారు. స్టేడియం ఆవరణలోని బాస్కెట్ బాల్ కోర్టులో శనివారం స్టేడియం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 1వ ఎన్టీఆర్ మెమోరియల్ రాష్ట్రస్థాయి ఓపెన్ ఇన్విటేషన్ బాస్కెట్‌బాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సాహించడం, క్రీడల అభ్యున్నతే స్టేడియం కమిటీ లక్ష్యమన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో పలు క్రీడాంశాల్లో స్టేడియం క్రీడాకారులు సత్తాను చాటుతున్నారని యలవర్తి అన్నారు. తొలుత ఎన్టీఆర్ కాంస్య విగ్రహం, పర్వతనేని జగన్మోహనరావు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్ళులర్పించారు. కార్యక్రమంలో స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్, టీడీపీ నాయకులు చేకూరు జగన్మోహనరావు, స్టేడియం కమిటీ సభ్యులు అట్లూరి భవానీ ప్రసాద్, తిరుపతయ్య, వరప్రసాద్, రవికుమార్, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

దుర్గాష్టమి వేడుకలకు ఏర్పాట్లు

గుడ్లవల్లేరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి) : కొండాలమ్మ ఆలయంలో ఈ ఏడాదికూడా దుర్గాష్టమిని నిర్వహించనున్నామని ఆలయ చైర్మన్ ఈడే వెంకట విష్ణుమోహనరావు(మోహన్) అన్నారు. శనివారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించే దుర్గాష్టమి వేడుకల పనులను ఈవో ఆకుల కొండలరావుతో కలిసి పర్యవేక్షించారు. 30 వేల మందికి పైగా భక్తులకు అన్న సమారాధన నిరవహించనున్నామన్నారు పటిష్టమైన పోలీసు బందోబస్తుకు ఎస్సై ఎన్.వి.వి.సత్యనారాయణ సహకారం కోరామని ఆయన తెలిపారు.


బందోబస్తుపై పోలీసులతో చర్చిస్తున్న చైర్మన్ ఈడే వెంకట విష్ణుమోహనరావు(మోహన్)


గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులు

ఘనంగా ఏఎన్ఆర్ కళాశాల స్నాతకోత్సవం

గుడివాడ, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధి నేటి యువతపైనే ఆధారపడి ఉందని, యువత సాంకేతికతను అందిపుచ్చుకోవాలని సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్, విజయవాడ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పరుచూరి వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం ఏఎన్ఆర్ కళాశాలలో స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు రాష్ట్ర, దేశ సంస్కృతి, సాంప్రదాయాలను మరువకూడదన్నారు. అనంతరం గ్రాడ్యుయేషన్ పట్టాలను అందజేశారు. కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు ఎల్.ఆర్.కె.ప్రసాద్, కె.ఎస్.అప్పారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జె.ఎస్.కుమార్, వైస్ ప్రిన్సిపాల్ బి.ఎస్.ఎస్.పద్మజ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎం.రవిసుందర్ పాల్గొన్నారు.

అనధికార ఫ్లెక్సీలు తొలగించండి

గుడివాడ, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): హైకోర్టు ఉత్తర్వుల మేరకు పట్టణంలో అనధికార ఫ్లెక్సీలు, పోస్టర్లను వెంటనే తొలగించాలని భవిష్యత్ భద్రతా దళం సభ్యులు మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దళం సభ్యులు మాట్లాడుతూ వీటి ఏర్పాటుతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుందని, పర్యావరణానికి హాని కలిగిస్తున్నాయన్నారు. మురళీకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.


మున్సిపల్ కమిషనర్ మనోహర్‌కు వినతిపత్రం అందజేస్తున్న భవిష్యత్ భద్రతా దళం సభ్యులు

లారీ ఢీకొని ముఠా కార్మికుడికి తీవ్ర గాయాలు

గుడివాడ రూరల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని ముఠా కార్మికుడికి తీవ్రగాయలయ్యాయి. వేల్పూరు-సిద్ధాంతం రోడ్డులో ఉన్న గోడౌన్స్ వద్ద బిళ్లపాడుకు చెందిన పామర్తి దుర్గారావు ముఠా పని చేస్తుంటాడు. ఈ నెల 26న గోడౌన్‌లో ముఠాపని ముగించుకుని, గోడ పక్కన పడుకున్నాడు. డ్రైవర్ సమ్మిట రాంబాబు నిర్లక్ష్యంగా లారీ నడిపి దుర్గారావుపై ఎక్కించాడు. ఈ ఘటనలో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని గుడివాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్సై చంటిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పీ-4 విజయవంతానికి కృషి చేయండి

పెదపారుపూడి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): పీ4 విజయవంతం కావటానికి సచివాలయ సహాయకులు తోడ్పాటు అవసరమని ఎంపీడీవో విమాదేవి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో శనివారం జరిగిన జీవో పావర్టీ పీ4 విధానంపై శిక్షణ జరిగింది. సచివాలయ సహాయకులు వారికి మ్యాప్ చేయబడిన క్లస్టర్స్‌లో బంగారు కుటుంబాలను కనీసం మూడు నెలలకు ఒకసారి సందర్శించి యోగ క్షేమాలు ఆరా తీసి, అవసరాలను యాప్‌లో ఆప్ లోడ్ చేయాలన్నారు. డిప్యూటీ ఎంపీడీవో వంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యం నెరవేర్చటంలో సానుకూల దృక్పథం అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు విజయ్ కుమార్, బికోటయ్య, కృష్ణవేణి, కిరణ్ కుమార్, లావణ్య, మెహరున్నీసా బేగం పాల్గొన్నారు.

నైపుణ్యం పెంపుదలకు వర్క్‌షాపులు దోహదం

గుడివాడ, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): కళాశాలల్లో నిర్వహించే సాంకేతిక వర్క్‌షాపుల ద్వారా విజ్ఞానం, నైపుణ్యాలను పెంపొందించుకోవాలని శ్రీఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చిట్టూరి రవీంద్రబాబు అన్నారు. శనివారం గౌరీశంకరపురంలోని శ్రీఆదిత్య డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు డెవ్ ఓపీఎస్, కామర్స్ విద్యార్థులకు ఏఐ ఇన్ ఫైనాన్స్ అంశాలపై శిక్షణ శిబిరం నిర్వహించారు. ఇన్నోవేషన్‌ను ప్రోత్సాహించడం, నెట్‌వర్కింగ్ అవకాశాలు, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా మార్పులను తీసుకురావడంపై వర్క్‌షాపులో శిక్షణించారన్నారు. విద్యార్థులకు సర్టిఫికేట్లను అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ ఆలియా బేగం పాల్గొన్నారు.


గుడివాడ చిన్న శివాలయంలో లలితా త్రిపురసుందరీ దేవి అలంకారంలో అమ్మవారు


వేణుగోపాలస్వామి దేవస్థానంలో శ్రీవైష్ణవిదేవి అలంకారంలో అమ్మవారు


తోట్లవల్లూరు శివాలయంలో లలితా త్రిపురసుందరీదేవిగా అమ్మవారు


ఎరుకపాడులో సంతానలక్ష్మిగా అష్టలక్ష్మి


పామర్రు శివాలయంలో సంతానలక్ష్మిగా పార్వతీదేవి

వైభవంగా దేవీ శరన్నవరాత్రులు

గుడివాడ, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రులు వైభవంగా సాగుతున్నాయి. ఆరో రోజు శనివారం లలితా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చారు. భీమేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం అమ్మవారు కాత్యాయనీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఆలయ ఈవో కె.వి.గోపాలరావు, ఉత్సవ కమిటీ చైర్మన్ పట్టపు చిన్నా, సభ్యులు పాల్గొన్నారు. శ్రీగౌరీశంకరస్వామి దేవస్థానంలో అమ్మవారు శ్రీలలితా త్రిపుర సందరీ దేవిగా దర్శనమిచ్చారు. లోక కల్యాణార్థం మహాచండీ యాగం నిర్వహించారు. ధర్మకర్తల కమిటీ చైర్మన్ నెరుసు బోసు, సభ్యులు పాల్గొన్నారు. శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానంలో అమ్మవారు శ్రీవైష్ణవిదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ధర్మకర్తల కమిటీ చైర్మన్ అంగడాల సతీష్, సభ్యులు పాల్గొన్నారు. శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీసంతాన లక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవ కమిటీ చైర్మన్ లింగం చిట్టిబాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. నీలామహల్ రోడ్డులో వేంచేసియున్న శ్రీవిజయదుర్గమ్మ దేవస్థానంలో అమ్మవారు శ్రీవైష్ణవిదేవిగా దర్శనమిచ్చారు. ఈవో గంగు శిరీషా, ధర్మకర్తల కమిటీ చైర్మన్ హరిబాబు, సభ్యులు, పాల్గొన్నారు.

తోట్లవల్లూరు శివాలయంలో..

తోట్లవల్లూరు: తోట్లవల్లూరు శ్రీభ్రమరాంభ చెన్నమల్లికార్జునస్వామి దేవస్థానంలో అమ్మవారు లలితా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. వల్లూరుపాలెం కరకట్టపై శివాలయం, భద్రిరాజుపాలెం రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో లలితా త్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చారు.

ఎరుకపాడు అష్టలక్ష్మీ ఆలయంలో..

గుడివాడ రూరల్: ఎరుకపాడులో అష్టలక్ష్మీ ఆలయంలో అమ్మవారిని సంతాన లక్ష్మీగా అలంకరించారు. ఆలయ ట్రస్టీ చైర్మన్ బొప్పూడి సుబ్రహ్మణ్యేశ్వరరావు, ట్రస్టీ సభ్యులు పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

సంతానలక్ష్మిగా పార్వతీదేవి

పామర్రు: పామర్రు శివాలయంలో పార్వతీ దేవి, సంతానలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అంకమ్మతల్లి దేవాలయంలో శ్రీలలితా త్రిపుర సుందరి దేవిగా, శ్రీవాసవీమాత ఆలయంలో కాత్యాయనిదేవిగా దర్శనమిచ్చారు.


కొండాలమ్మ ఆలయంలో పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఈవో కొండలరావు, ధర్మకర్తలు

కొండాలమ్మ దేవాలయంలో..

గుడ్లవల్లేరు: వేమవరం కొండాలమ్మ దేవస్థానంలో శనివారం అమ్మవారు లలితా త్రిపున సుందరీ దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయంలో అమ్మవారికి సహస్రనామార్చన, లలితా త్రిపునసుందరీ మూలమంత్ర హననం నిర్వహించారు. సాయంత్రం సాయంకాలర్చన, అమ్మవారికి ఊంజల సేవ, పంచహారతులు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈవో ఆకుల కొండలరావు, చైర్మన్ ఈడే వెంకట విష్ణుమోహనరావు(మోహన్), కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

లలితా త్రిపుర సుందరీదేవికి లక్ష కుంకుమార్చన

కూచిపూడి: మొవ్వ మండలం పెదపూడి (బందరు రోడ్డు) ఆంధ్ర బ్యాంక్ సమీపంలో కనకదుర్గమ్మవారి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న దసరా నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా అమ్మవారికి లక్ష కుంకుమార్చన నిర్వహించారు. శ్రీ లలితా త్రిపుర సుందరిదేవిగా అలంకరించిన ప్రత్యేక పూజలు చేశారు.


లక్ష కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

డీఎస్సీలో కనకదుర్గకు జిల్లా నాల్గో స్థానం

కూచిపూడి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మొవ్వ మండలం కూచిపూడి గ్రామానికి చెందిన వినుకొండ కనకదుర్గ స్కూల్ అసిస్టెంట్ (లెక్కలు) లో నాల్గో ర్యాంకు సాధించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకుని వివాహమై ఇద్దరు పిల్లలు కలిగిన తర్వాత ఆమె ఉద్యోగ సాధించటంపై కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా నుంచి అపాయింట్‌మెంట్ ఆర్డరు తీసుకున్నారు. పదో తరగతి వరకు శ్రీ సిద్దేంద్ర జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చదివి 521 మార్కులు సాధించి, మొవ్వ క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియ్ (ఎంపీసీ) 911 మార్కులు పొంది మొదటి స్థానంలో నిలిచారు. డిగ్రీ (బీఎస్సీ)లో కూడా 80 శాతంపైగా మార్కులు సాధించి ఉత్తీర్ణత పొంది. మచిలీపట్నం ఆంధ్రా జాతీయ కళాశాలలో బీఎడ్ చేశారు. భర్త చెన్నకేశస్వామి విద్యుత్ శాఖలో పని చేస్తున్నాడు. పామర్రులో నివాసం ఉంటున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.



ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా నుంచి అపాయింట్‌మెంట్ లెటర్ అందుకుంటున్న వినుకొండ కనకదుర్గ

నియోజకవర్గ అభివృద్ధికి
నిధులు కేటాయించండి

పామర్రు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా శనివారం సీఎం చంద్రబాబును కలసి వినతి పత్రం అందజేశారు. గ్రామాల్లో డొంక రోడ్లు రోడ్ల నిర్మాణలు సక్రమంగాలేక వ్యవసాయ పనుల అనంతరం, ఉత్పత్తులను రైతులు బయటకు తీసుకువచ్చేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. లంక గ్రామాల్లో విద్యుత్ టవర్లు, వంతెనల నిర్మాణాల అంశాలను వివరించారు. సీఎం సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.


ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

పమిడిముక్కల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన పంట రైతు సహాయక కేంద్రాల్లో తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని ఉయ్యూరు ఆర్డీవో బి.హేలాషారోన్ అన్నారు. తాడంకి తదితర గ్రామాల్లో జరుగుతున్న పంట నమోదు ప్రక్రియను శనివారం పరిశీలించారు. పంటనమోదు ప్రక్రియ ఈనెల 30తో ముగుస్తుందని, రైతులు తప్పనిసరిగా ఈ-క్రాప్ చేయించుకోవాలన్నారు. అధికారులతో సహకరించాల్నారు. మంల వ్యవసాయ అధికారులు, వీఏఏలు పాల్గొన్నారు.

● **తోట్లవల్లూరు:** నెలాఖరులోపు రైతులు ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారిణి జి.శ్రీదేవి సూచించారు. శనివారం ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ మండలంలో 14వేల ఎకరాల్లో పంటలను నమోదు చేయాల్సి ఉందన్నారు. ఇప్పటి వరకు 10,500 ఎకరాల్లో నమోదు పూర్తయిందన్నారు. గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలకు వచ్చి రైతులు వివరాలు అందజేయాలని, లేదా సిబ్బంది పొలాలకు వచ్చినపుడు నమోదు చేయించుకోవాలని శ్రీదేవి కోరారు.


తోట్లవల్లూరులో వరి పొలాన్ని నమోదు చేస్తున్న ఏవో శ్రీదేవి

పంటనమోదు రికార్డుల తనిఖీ

పమిడిముక్కల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పంటనమోదుపై రైతుల్లో అవగాహ కల్పించి ఈనెల చివరిలోగా నమోదు ప్రక్రియ నూరుశాతం పూర్తిచేయాలని గన్నవరం ఏడీఏ సునీల్ అధికారులను ఆదేశించారు. చోరగూడి లో శనివారం పంట నమోదు ప్రక్రియను పరిశీలించి, రైతు సహాయ కేంద్రంలో నమోదుకు సంబంధించిన రికార్డులు తనిఖీ చేశారు. మండల వ్యవసాయ అధికారి గణేశ్‌రెడ్డి, విస్తరణ అధికారి సునీల్ గవాస్కర్ పాల్గొన్నారు.


చోరగూడి రైతు సహాయక కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ సునీల్

13 గంటల పని విధానాన్ని వ్యతిరేకించండి

● శ్రామిక హక్కుల పోరాట సంఘం జిల్లా కన్వీనర్ ఆర్.రఘు పిలుపు

గుడివాడ, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి) : శాసనసభ సమావేశాల్లో ప్రభుత్వం కార్మికులతో రోజుకు 13గంటలు పనిచేయించుకోవడానికి అనుమతినిస్తూ ఫ్యాక్టరీ సవరణ చట్టం-2025ను ఆమోదింపజేయడం దారుణమని, ఆ చట్టాన్ని వ్యతిరేకించాలని శ్రామిక హక్కుల పోరాట సంఘం జిల్లా కన్వీనర్ ఆర్. రఘు పిలుపునిచ్చారు. ఆటోనగర్‌లో శనివారం విలేకర్లతో మాట్లాడుతూ పెట్టుబడిదారులను సంతృప్తి పరచడానికి కార్మికవర్గంపై ప్రభుత్వం ముప్పేటదాడి చేస్తోందన్నారు. రానున్న కాలంలో కార్మిక , శ్రామిక వర్గానికి తీవ్ర నష్టం వాట్టిల్లే ప్రమాదముందన్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోండి

● డ్వాక్రా మహిళలకు ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాసరావు సూచన

గుడివాడ రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళలు ప్రభుత్వపథకాలు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో జి.శ్రీనివాసరావు అన్నారు. వెలుగు కార్యాలయంలో శనివారం మండల పశుసంవర్థక శాఖ డాక్టర్ ఉన్నం హనుమంతరావు ఆధ్వర్యంలో డ్వాక్రా గ్రూపు సభ్యులకు కోళ్లు, గొర్రెలు, గేదెల రుణాలకు ఎలా దరఖాస్తు చేసుకోవాలో వివరించారు. రాయితీపై వాటిని అందిస్తామని తెలిపారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	232
చికెన్ స్కిన్‌లెస్	242

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 550

నేడు మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ పర్యటన

నాగాయలంక, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కొల్లు పెద్దిరాజు ఆదివారం నాగాయలంకలో పర్యటిస్తారని మత్స్యకారుల సంఘ నాయకులు లకనం నాగాంజనేయులు, కర్రి కృష్ణమూర్తి తెలిపారు. ఉదయం 9 గంటలకు నాగాయలంకలో మత్స్యకారుల నివాస ప్రాంతాల్లో పెద్దిరాజు పర్యటిస్తారని, వారి జీవన స్థితిగతులు పరిశీలిస్తారని పేర్కొన్నారు. వృత్తిపరమైన సమస్యలు అడిగి తెలుసుకుంటారని స్పష్టం చేశారు. అనంతరం కృష్ణానది ఒడ్డున ఉన్న ఫుడ్‌కోర్టులో మత్స్యకార పెద్దలు, సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తారని తెలిపారు.



పారిశుధ్య కార్మికులకు దుస్తులు, కిట్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ, డీపీవో అరుణ

పారిశుధ్య కార్మికులకు దుస్తులు, శానిటరీ కిట్లు పంపిణీ

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): నిరంతరం పారిశుధ్య పనుల్లో నిమగ్నమయ్యే కార్మికులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాలులో శనివారం డివిజన్ పరిధిలోని 350 మంది పారిశుధ్య కార్మికులకు దుస్తులు, శానిటరీ కిట్లను ఆయన పంపిణీ చేశారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ బి.నాగమణి, జిల్లా పంచాయతీ అధికారి డాక్టర్ జె.అరుణ ప్రసంగించారు. కార్మికులకు రూ.10 లక్షల విలువైన బీమా సౌకర్యం కల్పిస్తున్నామన్నారు.



కవన కుసుమాలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ ధన్వంతరీ ఆచార్య, గుత్తికొండ సుబ్బారావు

కవన కుసుమాలు పుస్తకావిష్కరణ

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కవులు, రచయితలు సామాజిక దృక్పథం కలిగి ఉండాలని ప్రపంచ తెలుగు రచయితల సంఘం అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు అన్నారు. కవి మేడిశెట్టి యోగేశ్వరరావు రచించిన కవన కుసుమాలు పుస్తకాన్ని శనివారం మహతి కళావేదికపై డాక్టర్ బి.ధన్వంతరీ ఆచార్య, గుత్తికొండ సుబ్బారావు ఆవిష్కరించారు. సాహితీ సంస్థ అధ్యక్షుడు లంకిశెట్టి బాలాజీ అధ్యక్షత వహించారు. ఆర్టీసీ డిపో మేనేజర్ పెద్దిరాజు, భవిష్య, పిల్లారిశెట్టి నరసింహారావు, తెలుగుభాషా సాంస్కృతిక సమాఖ్య ప్రధాన కార్యదర్శి అప్పినీడి పోతురాజు, వై.సురేష్‌బాబు, రంగనాథ్, శివాజీ, సాంబశివరావు, ఏడుకొండలు పాల్గొన్నారు.

శ్రీలలితా నమోస్తుతే

మచిలీపట్నం టౌన్/పెడన/నాగాయలంక/అవనిగడ్డ/అవనిగడ్డ రూరల్/మోపిదేవి/కోడూరు/చల్లపల్లి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో 6వ రోజు శనివారం అమ్మవారు లలితా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మచిలీపట్నం రాబర్ట్సన్‌పేటలోని రామలింగేశ్వరస్వామి, బచ్చుపేటలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి, కొజ్జిల్లిపేట నాగేశ్వరస్వామి, బందరుకోట రామాలయం, గుండుపాలెం, చిన్నాపురం గ్రామాల్లోని దేవాలయాల్లో అమ్మవారిని లలితాదేవిగా అలంకరించారు. బచ్చుపేట మల్లేశ్వరస్వామి ఆలయంలో చండీ హోమం నిర్వహించారు. ఈడేపల్లి శక్తిగుడి, భాస్కరపురం త్రిశక్తిపీఠం, నిజాంపేట ఆది వనమలమ్మ, సర్కిల్‌పేట కంచి కామాక్షి ఆలయం, బచ్చుపేట కరుమారి అమ్మవారి, బుట్టాయిపేట దత్తాశ్రమం, కన్యకా పరమేశ్వరీ దేవాలయాల్లో అమ్మవారిని విశేషంగా అలంకరించారు. పెడన పైడమ్మ అమ్మవారు లలితా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. నాగాయలంక మండలం గణపేశ్వరం గ్రామంలో దుర్గా గణపేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు కాత్యాయనీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారు లలితా త్రిపురసుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వేకనూరులో నిర్వహిస్తున్న దసరా మహోత్సవాల్లో అమ్మవారు ధనలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. పులిగడ్డ కనదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని లలితా త్రిపుర సుందరీదేవిగా, అవనిగడ్డలో రాజరాజేశ్వరీ అమ్మవారు గజలక్ష్మి అవతారంలో, దివిసీమ వాసుల ఇలవేల్పు లంకమ్మ అమ్మవారు గజలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మోపిదేవి మండలం పెదకళ్లేపల్లి దుర్గానాగేశ్వరస్వామి ఆలయం, కొక్కిలిగడ్డ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయం, కె.కొత్తపాలెం దుర్గాకోటేశ్వరస్వామి ఆలయాల్లో అమ్మవారు లలితా త్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చారు. కోడూరు కనకదుర్గమ్మ ఆలయం వద్ద, గంగానమ్మ ఆలయం వద్ద, విశ్వనాథపల్లి, మందపాకల అద్దంకి నాంచారమ్మ ఆలయాల వద్ద అమ్మవార్లు లలితా త్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చారు. చల్లపల్లిలోని అన్నపూర్ణాసమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం, కన్యకా పరమేశ్వరి ఆలయం, నడకుదురు పృథ్వీశ్వర క్షేత్రంలో బాలాత్రిపురసుందరీదేవి అలంకారంలో ఉన్న అమ్మవారికి పూజలు చేశారు. లక్ష్మీపురంలోని దుర్గాపార్వతీసమేత సోమేశ్వరస్వామి ఆలయం, బాలాత్రిపుర సుందరి సహిత లక్ష్మీనాంచారమ్మ అమ్మవారి ఆలయం, రామానగరం క్లబ్‌రోడ్‌లోని ఉత్సవపందిరితో పాటు పలు గ్రామాల్లోని ఆలయాలు, ఉత్సవపందిళ్లలో అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి.



చిన్నాపురంలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



పెడన పైడమ్మ



పులిగడ్డ దుర్గమ్మ



పెదకళ్లేపల్లిలో..

ఉత్సాహంగా తాళం భజన పోటీలు



పోటీల్లో పాల్గొన్న వెంకటేశ్వర సంకీర్తన మండలి భజన సమాజ సభ్యులు

ఘంటసాల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దేవీశరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా చిట్టూర్పులో గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న తాళం భజన పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. మల్లంపల్లికి చెందిన విజయదుర్గా భజన సమాజం, విజయవాడకు చెందిన వెంకటేశ్వర సంకీర్తన మండలి భజన సమాజం, చటారిపాలేనికి చెందిన విఘ్నేశ్వర భక్తసమాజం, పోలవరాని కి చెందిన నటరాజ భక్త గానమాధురి సమాజం, బోళ్లపాడు కు చెందిన సీతారామాంజనేయ భజన సమాజం సభ్యులు అత్యుత్తమ ప్రదర్శనలిచ్చారు. న్యాయనిర్ణేతలుగా పొడుగు ప్రసాద్, శ్రీనివాస్ వ్యవహరించారు. తాళం భజన పోటీలను కొడాలి పీఏసీఎస్ చైర్మన్ గుత్తికొండ వరప్రసాద్, వేములపల్లి సుధీర్ పర్యవేక్షించారు.



మచిలీపట్నం బార్ అసోసియేషన్ హాలులో వైద్య సేవా శిబిరంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి గోపి

న్యాయవాదులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): న్యాయవాదులు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా జడ్జి గోపి అన్నారు. శనివారం జిల్లా కోర్టులోని బార్ అసోసియేషన్ హాలులో నిర్వహించిన ఉచిత వైద్య సేవా శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. రోజూ కొంతసేపు వ్యాయామం, యోగ చేయడం వల్ల చక్కని ఆరోగ్యం పొందవచ్చన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దివి పోతురాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరాన్ని సెంటినీ ఆస్పత్రి వైద్యులు నిర్వహించారు. సాహితీవేత్త, న్యాయవాది కోసూరు మాధవ వెంకట కృష్ణతో పాటు ఇటీవల జపాన్‌లో జరిగిన కరాటే పోటీల్లో బంగారు పతకం సాధించిన న్యాయవాది నున్న అరవిందకుమార్‌ను జిల్లా జడ్జి సత్కరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఘంటసాల, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన పాపవినాశనం గ్రామసమీపంలో కరకట్టపై శుక్రవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మొవ్వలోని జగ్జీవన్‌రామ్‌నగర్‌కు చెందిన మునిపల్లి బసవయ్య(యేసురత్నం) (46) కొంతకాలంగా చల్లపల్లి మండలం వెలివోలు గ్రామంలో అత్తవారింటి వద్ద భార్య, పిల్లలతో కలిసి నివాసముంటున్నాడు. శుక్రవారం ఉదయం స్కూటీపై మొవ్వ వెళ్లిన బసవయ్య తిరిగి రాత్రి 7.30 గంటల సమయంలో శ్రీకాకుళంలో స్కూటీ నిలిపి పాపవినాశనం సమీపంలో ఉన్న కరకట్టపై నడుచుకుంటూ వెళ్తున్నాడు. గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య వెంకటేశ్వరమ్మ, కుమారుడు, కుమార్తె కలరు. కుమారుడు రాకేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

గద్దె రామ్మోహన్, టీడీ జనార్దన్‌కు గ్రామీణ వైద్యుల కృతజ్ఞతలు

గూడూరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమావేశంలో గ్రామీణ వైద్యుల ప్రాథమిక వైద్యసేవలకు గుర్తింపు, గతంలో టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన 465 జీవో అమలు చేయాలని ప్రస్తావించిన విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు, గ్రామీణ వైద్యుల గుర్తింపు కోసం అహర్నిశలు కృషి చేస్తున్న టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్‌కు గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బి.వెంకటరాజు కృతజ్ఞతలు తెలిపారు. శనివారం గూడూరులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ వైద్యుల గుర్తింపు కోసం కృషి చేస్తున్న ఫెడరేషన్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు రాజాసిద్ధార్థ, ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.ఎస్.ప్రసాద్, ప్రధాన కార్యదర్శి కంబాల బాబూరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్‌ఎంపీ వైద్యుల జిల్లా ప్రధాన కార్యదర్శి నెల్లి రాంబాబు, జిల్లా ట్రెజరర్ కె.రంగారావు, జిల్లా కార్యదర్శి ఎండీ బషీర్, పెడన ఏరియా అధ్యక్షుడు రవీంద్ర, శివ పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు వేగవంతం చేయండి

పెడన రూరల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సాగులో ఈ-క్రాప్ నమోదు కార్యక్రమాన్ని వేగంగా నిర్వహించాలని తహసీల్దార్ కె.అనిల్‌కుమార్ సూచించారు. రైతుసేవా కేంద్రంలో మండల వ్యవసాయాధికారిణి సజ్జా జెస్సీతో కలిసి వీఏవోల సమావేశం నిర్వహించారు. గ్రామ సహాయ వ్యవసాయాధికారులు ఈ-పంట నమోదు త్వరగా పూర్తిచేయాలని ఇప్పటివరకు 65 శాతమే పూర్తయిందని మిగిలిన 35 శాతం వారంలో పూర్తిచేయాలని జెస్సీ సూచించారు.

మర్యాదపూర్వకంగా..

● ఎస్సీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన దళిత నేతలు



ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్‌ను సత్కరిస్తున్న దళితనేతలు, ప్రముఖులు

చల్లపల్లి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కమిషన్ చైర్మన్ కొత్తపల్లి శామ్యూల్ జవహర్‌ను చల్లపల్లిలో పలువురు దళితనేతలు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. శనివారం చల్లపల్లిలో ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన జవహర్‌ను ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ పైడిపాముల స్వప్న, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు కైతేపల్లి దాస్, దళిత చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు బుల్లా కిషోర్, దిరిశం వెంకట్రావ్, రెవరెండ్ దేవదానం, ఏపీ చంద్రశేఖరరావు కలిసి సత్కరించారు.

వరద తగ్గుముఖం

అవనిగడ్డ రూరల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు విడుదలవుతున్న వరద కారణంగా పులిగడ్డ ఆక్విడెక్ట్ వద్ద 14.3 అడుగుల నీటిమట్టం కొనసాగుతుంది. ప్రకాశం బ్యారేజీ నుంచి 3.20 లక్షల క్యూసెక్కుల వరద నీరు విడుదల అవుతోంది. వరద తగ్గుముఖం పట్టిందని తీర గ్రామాల ప్రజలు ఆందోళన చెందొద్దని ఇరిగేషన్ డీఈ గణపతి తెలిపారు.



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

రక్తదాన శిబిరం

అవనిగడ్డ, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): స్వస్థ్ నారీ- సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా రెవెన్యూ హాలులో శనివారం వైద్యఆరోగ్యశాఖ, రెడ్‌క్రాస్ సంయుక్త ఆధ్వర్యంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రారంభించారు. పలువురు యువకులు రక్తదానం చేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎ.వెంకట్రావు, బీజేపీ నియోజకవర్గ కో-కన్వీనర్ తుంగల వెంకటగిరి, ఏఎంసీ వైస్ చైర్మన్ రాజనాల వీరబాబు, డాక్టర్ మహేష్, డాక్టర్ రియాజ్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు డాక్టర్ వంగర శేషగిరిరావు, గరికపాటి హరిప్రసాద్, కోడూరు శ్రీను, సామర్ల మల్లి పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): పచ్చదనం పరిశుభ్రతతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని జిల్లా కేంద్ర గ్రంథాలయ కార్యదర్శి వేములపల్లి రవికుమార్ అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయం వద్ద శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. గ్రంథాలయంలోని పనికిరాని వస్తువులను తరలించారు. గదులు శుభ్రం చేశారు. మొక్కలు నాటారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి అంబటి అశోక్‌కుమార్, డిప్యూటీ లైబ్రేరియన్ బీరం వెంకటరమణ, సీనియర్ అసిస్టెంట్ బి.విజయకుమార్, ఐవీవీ రామారావు, కేవీఎన్ బసవేశ్వరరావు, షేక్ కాలేషా, బి.వాసవి, వై.శ్రీనివాసరావు, కె.సుందరి పాల్గొన్నారు.



సాయిచరిత శతకాన్ని ఆవిష్కరిస్తున్న హేమంత్‌కుమార్

షిరిడి సాయి ఆధ్యాత్మిక మార్గం అనుసరణీయం

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): షిరిడి సాయి ఆధ్యాత్మిక మార్గం అనుసరణీయమని న్యాయవాది కె.ఎస్.ఆర్.హేమంతకుమార్ అన్నారు. పల్లావఝుల వెంకటశైలజ రచించిన శ్రీ సాయిచరిత శతకం ద్వితీయ సంపుటిని శనివారం జిల్లా కోర్టుసెంటర్‌లోని షిరిడి సాయిబాబా దేవాలయంలో ఆయన ఆవిష్కరించారు. సాయి తత్వాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు వెంకటశైలజ శతక రూపంలో రాయడం అభినందనీయమన్నారు. ఇంజనీర్ ఆర్.వి.ఎస్.మురళీధర్, టీడీపీ జిల్లా ప్రచార కార్యదర్శి పి.వి.ఫణికుమార్, పి.వి.రమణరావు, న్యాయవాది రామిశెట్టి మురళీకృష్ణ, కిరణ్ పాల్గొన్నారు.

పురిటిగడ్డలో పొలం బడి

చల్లపల్లి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పురిటిగడ్డలో శనివారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. వరిపంటలో చీడపీడల యాజమాన్యం, నూతన సాగు విధానాలపై రైతులకు మండల వ్యవసాయశాఖ అధికారి కె.మురళీకృష్ణ అవగాహన కల్పించారు. ఈ-క్రాప్ నమోదు చేయించుకోని రైతులు వెంటనే గ్రామ వ్యవసాయశాఖ సహాయకుడిని సంప్రదించి ఈ నెలాఖరులోపు చేయించుకోవాలని సూచించారు. మాజీ సర్పంచ్ పరుచూరి సురేష్, రైతులు, వీఏఏలు నాగబాబు, సత్యదేవ్, రేవతి పాల్గొన్నారు.

జీఎస్టీ సవరణలపై అవగాహన

పెడన రూరల్, సెప్టెంబర్ 27(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ సవరణలు చేసిన నేపథ్యంలో వెలుగు కార్యాలయంలో అంగన్వాడీ కార్యకర్తలకు, పొదుపు సంఘాల బుక్‌కీపర్లకు, విద్యార్థులకు సేల్స్‌టాక్స్ గుడివాడ అసిస్టెంట్ కమిషనర్ ఎ.రంగమణి అవగాహనా సదస్సు నిర్వహించారు. సమావేశానికి ఎండీవో ఎ.అరుణకుమారి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. జీఎస్టీ తగ్గింపులు తెలిపే కరపత్రాలను ఆవిష్కరించారు. వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం శ్రీదేవి, కె.అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

మండలి వెంకట కృష్ణారావుకు ఘన నివాళి



పులిగడ్డ టోల్‌ప్లాజా వద్ద మండలి వెంకట కృష్ణారావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న నేతలు

అవనిగడ్డ రూరల్/నాగాయలంక/మోపిదేవి/కోడూరు/ఘంటసాల/చల్లపల్లి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి మండలి వెంకటకృష్ణారావు వర్ధంతిని పురస్కరించుకుని పులిగడ్డ టోల్‌ప్లాజా వద్ద గల విగ్రహానికి మండలి వెంకట్రామ్ నివాళులర్పించారు. ఇరిగేషన్ కార్యాలయం వద్ద ఉన్న విగ్రహానికి, మండలి వెంకట కృష్ణారావు - ప్రభావతి దేవిల సమాధుల వద్ద నాయకులు నివాళులర్పించారు. భావదేవరపల్లి, తలగడదీవిలో మండలి వెంకట కృష్ణారావు విగ్రహాల వద్ద కూటమి నాయకులు నివాళులర్పించారు. మోపిదేవి నుంచి రావివారిపాలెం వెళ్లే దారిలో ఉన్న గిరిజన కుటుంబాలకు దుప్పట్లు, దోమ తెరలను పంపిణీ చేశారు. కోడూరులో ఉచిత వైద్యశిబిరాన్ని నియోజకవర్గ యువ నాయకుడు మండలి వెంకట్రామ్ ప్రారంభించారు. కోడూరు, పిట్టల్లంక గ్రామాల్లో పేదలకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. మర్రె గంగయ్య, కోట రాంబాబు, కాగిత రామారావు, కొల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. భావదేవరపల్లి మండల పరిషత్ పాఠశాల వద్ద ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. 276 పశువులకు ఉచిత వైద్య పరీక్షలు చేశారు. శిబిరాన్ని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రారంభించారు. శ్రీకాకుళంలోని శీలంవారిపాలెంలో మండలి వెంకట కృష్ణారావు విగ్రహానికి నాటక అకాడమీ రాష్ట్ర చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, శీలం అశ్విన్-కృష్ణప్రభ, కూటమి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీకాకుళం గ్రామానికి చెందిన కళాకారులను సత్కరించి నూతన వస్త్రాలను అందజేశారు. పశువైద్యశాలకు వాటర్ ట్యాంక్ బహూకరించారు. పీహెచ్‌సీలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. శ్రీకాకుళం ఎంపీటీసీ తాడికొండ చిన్నా ఆధ్వర్యంలో చల్లపల్లి సీయోను వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. రోడ్డుపక్కన జీవించే నిరుపేదలు, సంచార జాతులవారికి 100 మందికి బిర్యానీ ప్యాకెట్లు పంపిణీ చేశారు. చల్లపల్లి సొసైటీ చైర్మన్ బొందలపాటి వీరబాబు, ప్రెస్‌పూర్ణల ఆధ్వర్యంలో వస్త్రదానం, నూకలవారిపాలెం ఎస్టీ కాలనీలో బిర్యానీ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ప్రభుత్వాసుపత్రిలో రోగులకు రొట్టెలు పంపిణీ చేశారు.